



ధ్వజావరోహణ ఘట్టం నిర్వహిస్తున్న పూజారులు

రామతీర్థంలో ముగిసిన ఉత్సవాలు

విడవలూరు, జూన్ 26 : రామతీర్థంలో జరుగుతున్న శ్రీ కామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజావరోహణంతో ముగిశాయి. ఉత్సవాల కోసం వచ్చిన సకల దేవతలను సాగనంపుతూ వచ్చే ఏడాది జరగనున్న ఉత్సవాలకు తిరిగి రావాలని కోరుతూ వేదాలు పఠిస్తూ ధ్వజస్తంభంపై ఉన్న కొడి గుడ్డను కిందకు దింపారు. అనంతరం సంతానం లేని మహిళలకు కొడిముద్దలను పంచారు. స్వామివారికి పూలంగి సేవ జరిగింది. రాత్రి స్వామి, అమ్మవారి ఏకాంత సేవను సర్వలాంఛనాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

● హుండీ ఆదాయం..

స్వామివారి ఉత్సవాలకు వచ్చిన భక్తులు హుండీల ద్వారా రూ.19,81,322 నగదును సమర్పించారు. ఆలయ ఆవరణలో ఈవో బొగ్గల మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. 2024లో జరిగిన బ్రహ్మోత్సవాల్లో రూ.19,85,173 ఆదాయం సమకూరింది. గత ఏడాది కన్నా ఈ ఏడాది దేవదాయ శాఖకి రూ.3,851 రాబడి తగ్గింది.

సోమశిల గేట్లకు రోప్‌ల ఏర్పాటు



మొదటి క్రస్ట్ గేటుకు ఏర్పాటు చేసిన స్టాప్‌లాక్ గేటు

అనంతసాగరం జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం క్రస్ట్‌గేట్ల పనుల్లో కదలిక వచ్చింది. గత వైసీపీ హయాంలో గేట్ల అభివృద్ధికి, జలాశయం పటిష్టతకు ఒక్క రూపాయికి కూడా వెచ్చించలేదు. కానీ కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా సోమశిల మనుగడను కాపాడేలా చర్యలు చేపట్టింది. రూ2.5 కోట్లతో పనులు చేసేలా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా తొలుత రోప్‌లు మార్చేందుకు చర్యలు చేపట్టారు. నెల రోజుల క్రితమే జలాశయం వద్దకు రోప్‌లు చేరగా, ప్రస్తుతం వీటిని అమర్చుతున్నారు. డ్యాంలో ప్రస్తుత నీటినిల్వ 33 టీఎంసీలు ఉండగా పనులు చేయడం అసాధ్యం కావడంతో డ్యాం వద్ద అందుబాటులో ఉన్నా గ్యాంటీక్రేన్‌తో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేసి పనులు పూర్తిచేసేలా కార్యాచరణ చేశారు. ట్రయల్ రన్‌గా ఒకటవ నెంబరు గేటుకు స్టాప్‌లాక్ గేటు బిగించి నీటి నియంత్రణ చేశారు. వాటి కొలతల ఆధారంగా త్వరలో మిగిలిన పనులు పూర్తిచేస్తామని నిపుణులు చెబుతున్నారు. కాగా, గురువారం డ్యాంకు 204 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ఉత్తర కాలువకు 425, దక్షిణ కాలువకు 700, పెన్నాడెల్టాకు 3,300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వీఆర్ హైస్కూల్లో 30 నుంచి తరగతులు

వివరాలు 8

- 6వ తేదీ పాఠశాల ప్రారంభం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి

మెప్మాలో డిజిటల్ సేవలు

● ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం), జూన్ 26(ఆంధ్రజ్యోతి) : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో (మెప్మా) డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలోని నెల్లూరు నగరపాలక సంస్థతోపాటు అన్ని మున్సిపాలిటీల పరిధిలోని పొదుపు మహిళలకు ఈ సేవలు అందనున్నాయి. పొదుపు సంఘాల సభ్యులకు త్వరితగతిన సేవలు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మెప్మా రిసోర్సు పర్సన్లకు ట్యాబ్‌లు అందిస్తోంది. జిల్లాకు 400లకుపైగా ట్యాబ్‌లు రాగా, కొన్నింటిని రాష్ట్ర మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆర్పీలకు అందజేశారు. మిగిలిన మున్సిపాలిటీల్లో ఆయా ఎమ్మెల్యేలు అందజేయనున్నారు. ఈ ట్యాబ్‌లు తీసుకున్న ఆర్పీలు, మెప్మా సిబ్బంది ఎప్పటికప్పుడు పొదుపు సంఘాల సభ్యుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. గతంలో ఆర్పీలు తమ సొంత సెల్‌ఫోన్ ద్వారా వివరాలు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసేవారు. అయితే, యాప్‌నకు ఫోన్ సహకరించక పోవడంతో ప్రభుత్వం ట్యాబ్‌లు అందజేస్తోంది. మెప్మా పీడీ బాల లీలారాణి మాట్లాడుతూ ప్రతి ఆర్పీకి రూ24వేల విలువైన ట్యాబ్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ డిజిటల్ సేవలను పారదర్శకంగా అందిస్తామని, అక్రమాలకు అవకాశం ఉండదని అన్నారు.



పొదుపు మహిళల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తున్న రిసోర్స్ పర్సన్



కనుల పండువగా చప్పర ఉత్సవం



నెల్లూరు (సాంస్కృతికం) : మూలాపేట శ్రీకృష్ణధర్మ రాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి చప్పర ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి కొడిముద్దలు పంచారు. ఉత్సవ మూర్తులకు విశేష పుష్పాలంకారం జరిగింది. భగవద్గీత పారాయణం, మహాభారత ప్రవచనం జరిగాయి. ఆలయ ఈవో జానకి, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చుదాం!

జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఎస్పీ జి కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్డీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు జేసీ కార్తీక్‌తోపాటు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు, నినాదాలతో మాదక ద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సభలో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

- వివరాలు 8లో..



'ఇంజనీరింగ్'కు పూర్వ వైభవం

గతేడాది 81 శాతం సీట్ల భర్తీ ● ఈ ఏడాది 5,993 మంది ఉత్తీర్ణత

కూటమి హయాంలో సానుకూల దృక్పథాలు ● కళాశాలల యాజమాన్యంలోనూ ఆనందం

ఇంజనీరింగ్ విద్య పూర్వ వైభవం సంతరించుకుంటోంది. ఇందుకు గతేడాది సీట్ల భర్తీయే నిదర్శనం. అదేస్థాయిలో ఈసారి కూడా సీట్ల భర్తీ ఉంటుందని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా అనుకూల పవనాలు వీస్తుండటంతో కౌన్సెలింగ్ ఎప్పుడు జరుగుతుందా అని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు 2025-26 విద్యాసంవత్సరానికి 11,560 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంజనీరింగ్‌కు 8,913 మంది, వ్యవసాయ, ఫార్మసీ కోర్సులకు 2,647 మంది పరీక్ష రాశారు. ఇంజనీరింగ్‌లో 5,993 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగంలో 2,263 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లు, కన్వీనర్ కోటా సీట్లు కలిపి 9వేల వరకు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది సీట్ల భర్తీ సంతృప్తినివ్వగా ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని యాజమాన్యాలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నీ సానుకూలంగానే జరుగుతున్నాయని తెలిపారు. ప్రవేశ పరీక్షలు సకాలంలో నిర్వహించడం, ఫలితాలను వెంటనే విడుదల చేయడంతోపాటు మరికొన్ని రోజుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ కూడా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ వేగవంతంగా పూర్తి చేసుకుని నెలరోజుల్లోనే తరగతులు కూడా ప్రారంభం అవుతాయని యాజమాన్యాలు చెబుతున్నాయి. అన్నీ సక్రమంగా జరుగుతుండడంతో విద్యార్థులు కూడా ఇంజనీరింగ్ చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

● గతేడాది 6,788 సీట్ల భర్తీ

గత విద్యాసంవత్సరంలో జిల్లాలోని 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 8,722 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సీఎస్‌ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ సీట్లపై విద్యార్థులు ఆసక్తి చూపారు. కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని కళాశాలలను ఎంపిక చేసుకున్నారు. 8,722 సీట్లకుగాను 6,788 సీట్లు భర్తీ (81.03 శాతం) అయ్యాయి.

● క్యాంపస్ ఎంపికలతో ఆసక్తి

ఏడాది కాలంలో అత్యధిక ఇంజనీరింగ్ కళాశాలల్లో క్యాంపస్ ఎంపికలు నిర్వహిస్తుండటం, పలు కంపెనీలు ఉద్యోగాలకు ఎంపిక చేస్తుండటంతో విద్యార్థులు జిల్లాలోని కళాశాలలపై మక్కువ చూపుతున్నారు. గత వైసీపీ హయాంలో క్యాంపస్ ఎంపికలు లేకపోవడం, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లు విడుదల కాకపోవడం తదితర కారణాలతో ఇంజనీరింగ్ విద్య ప్రశ్నార్థకంగా ఉండేది. కానీ ప్రస్తుతం పరిస్థితుల్లో మార్పులు వచ్చి తిరిగి కళాశాలలకు పూర్వ వైభవం వస్తుండటంతో యాజమాన్యాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులు కూడా సీఎస్‌ఈ, ఈసీఈ, ఐటీ వంటి గ్రూపులతోపాటు మెకానికల్, ఈఈఈ, సివిల్ గ్రూపులపైనా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఏడాది సీట్ల భర్తీ ఆశాజనకంగానే ఉంటుందని అందరూ భావిస్తున్నారు.

అక్షరం.. సంపూర్ణమయ్యేనా!?

సత్ఫలితాలనిచ్చిన అక్షర చైతన్యం కార్యక్రమం

రెండు విడతల్లో 1.60 లక్షల మంది ఉత్తీర్ణత

మూడో విడతలో మరో 2 లక్షల మంది గుర్తింపు

ఒక మనిషి ఉన్నత స్థితికి చేరుకోవడంలో ప్రధాన భూమిక పోషించేది విద్య మాత్రమే. అందుకే ప్రతి ఒక్కరూ చదువుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేందుకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. ఎన్ని చేసినా ఇంకా లక్షల మంది ప్రజలు నిరక్షరాస్యులుగానే ఉన్నారు. కనీసం చదవడం, రాయడం తెలిసి ఉంటే మరొకరి చేతుల్లో మోసపోకుండా ఉంటారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలో పురుడుపోసుకున్న ఉన్నత కార్యక్రమం 'అక్షర చైతన్యం'. ఇప్పటికి రెండు దశల్లో విజయవంతమవగా, మూడో దశ కోసం ఎదురుచూస్తోంది. ఈ దశలో దాదాపుగా జిల్లాలో మిగిలిన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు అవకాశాలున్నాయి. అయితే ఆ ప్రక్రియ అమలుకు కలెక్టర్ ఆనంద్ నిర్ణయం ఒక్కటే మిగిలి ఉంది.

8

కిసాన్ క్రెడిట్ కార్డులను అందించండి



వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు (హరనాథపురం) : జిల్లాలోని మత్స్యకారులు, పాడిరైతుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందించాలని కలెక్టర్ ఆనంద్ బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమితి సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పశుసంవర్ధక, మత్స్య శాఖల ఆధ్వర్యంలో కిసాన్ క్రెడిట్ కార్డులను అందించి మత్స్యకారులు, పాడిరైతులు సులభంగా బ్యాంకు రుణాలు పొందేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. వారంలోగా ఐదువేల కిసాన్ క్రెడిట్ కార్డులు అందచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతోపాటు ప్రైవేటు బ్యాంకులు కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వార్షిక రుణప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, పశుసంవర్ధక, మత్స్యశాఖ జేడీలు రమేష్ నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేస్తాం పాగా!

కందుకూరులో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారుల కన్ను

నకిలీ పట్టాలతో హస్తగతానికి విశ్వప్రయత్నం



పామూరురోడ్డు ప్రశాంతికాలనీ వద్ద ప్రభుత్వ స్థలాన్ని చదును చేసిన కబ్జాదారులు

కందుకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులో ప్రభుత్వ స్థలాలపై కబ్జాదారులు కన్నేశారు. రూ.కోట్లు విలువజేసే స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ స్థలాలకు పట్టాలు సృష్టించేందుకు కొందరు యత్నిస్తుండగా మరికొందరు గతంలోనే సృష్టించిన నకిలీ పట్టాల ఆధారంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓవీ రోడ్డులో బీసీ హాస్టల్ పక్కనున్న స్థలంలో ఓ వ్యక్తి చిల్లపొదలు, ఇతర పిచ్చిమొక్కలను తొలగించి ఆక్రమించేందుకు సిద్ధమయ్యాడు. అయితే, స్థానికుల ఫిర్యాదులతో అప్రమత్తమైన రెవెన్యూ అధికారులు వెంటనే అక్కడకు చేరుకుని సదరు స్థలంలో బోర్డు పెట్టి వచ్చారు. అయితే ఆ వ్యక్తి తనవద్ద ఉన్న నకిలీ పట్టాను ఆధారం చేసుకుని ఆ స్థలాన్ని కైవసం చేసుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. మార్కెట్ విలువను బట్టి ఆ స్థలం విలువ రమారమి కోటిన్నర రూపాయలు ఉంటుందని చెబుతున్నారు.

● పామూరు రోడ్డులోనూ..

అదేవిధంగా పామూరు రోడ్డులో ప్రశాంతికాలనీ సమీపంలో కోట్ల విలువైన ప్రభుత్వస్థలంపైనా కబ్జాదారులు కన్నేశారు. కాలనీ సమీపంలో సర్వే నెం. 122-1లో 1.75 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న స్థలం కావటంతో గత దశాబ్ద కాలంగా ఈ స్థలంపై కబ్జాదారులు కన్నేసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారు. కొందరు నకిలీపట్టాలు సృష్టించినట్లు సమాచారం. గత ప్రభుత్వంలో ఈ స్థలాన్ని జగనన్న కాలనీల కోసం లే అవుట్‌గా అభివృద్ధి చేయాలని లక్షలాది రూపాయల మున్సిపాలిటీ నిధులతో మట్టి తోలి లెవలింగ్ చేశారు. అయితే కారణం ఏమిటో తెలియదు కానీ ఆ ప్రాంతాన్ని లే అవుట్‌గా మార్చకుండా వదిలేశారు. ఈ స్థలం విలువ కనీసం రూ.5 కోట్లు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఈ స్థలంపై కూడా కబ్జాదారులు కన్నేశారు. 3 రోజులక్రితం 1.75 ఎకరాల్లోని చిల్లచెట్లు, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి చదును చేశారు. ఈ వ్యవహారంపై గురువారం 'ఆంధ్రజ్యోతి' మున్సిపల్ కమిషనర్ అనూషను ప్రశ్నించగా, తనకు ఎలాంటి సమాచారం తెలియదని విచారిస్తానని చెప్పగా రెవెన్యూ సిబ్బంది మాత్రం అక్కడికెళ్లి చూసి వచ్చారు. ఈ స్థలం పక్కనే లే అవుట్ వేసిన వ్యక్తులు గతంలో నకిలీపట్టాలు సృష్టించిన వారితో కలిసి దీనిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ స్థలాన్ని ఆర్టీఓ కార్యాలయానికి ఇవ్వాలని, పలు ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించాలని కూడా గతంలో ప్రయత్నం జరిగింది. పట్టణంలోని మరికొన్ని ప్రాంతాలలో కూడా విలువైన ప్రభుత్వస్థలాలను కైవసం చేసుకునేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.



ఓవీ రోడ్డులో బీసీ హాస్టల్ పక్కన...

బడికిరాని పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు

ముత్తుకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బడికి రాని పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఏఎంఓ సుధీర్‌బాబు, ఐటీడీఏ నోడల్ ఆఫీసర్ శాంతాకుమారి ముత్తుకూరు మండలంలో పర్యటించారు బసరాలదిబ్బ కాలనీలో బడికిరాని పిల్లలను గుర్తించారు. వారు ఏ కారణాల వల్ల బడికి వెళ్లలేకపోతున్నారో తెలుసుకుని, ప్రతిరోజు బడికి పంపేలా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్, ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9337
వెండి కిలో ధర	రూ. 110500
వెండి ఒక గ్రాము	రూ. 113.50

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడిన
నాయకులకు సన్మానం



సన్మానం అందుకున్న నాయకులు

ఇందుకూరుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ పోరాడిన నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, గూడూరు ప్రభాకర్ రెడ్డి, లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, బండి రమణా రెడ్డి, నాగరాజపల్లి సుధాకర్, కొల్లగట్ల భాస్కర్ రెడ్డిలను మండలంలోని కొత్తూరు వశిష్ట జూనియర్ కాలేజీలో గురువారం మండల బీజేపీ అధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులను, ఆర్మీని గౌరవించిన వారందరూ దేశభక్తులవుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వీ.సురేంద్రరెడ్డి, మారుబోయిన శ్రీనివాసులు, మండల బీజేపీ ఇన్‌చార్జ్ భాస్కర్‌గౌడ్, కాలేజీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, గాంధీ, ప్రసాద్, శివప్రసాద్, లలిత తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు సేవించటం ప్రాణాంతకం



విడవలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

విడవలూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను సేవించటం ప్రాణాంతకమని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు సుజాత, దీనదయాళ్ తెలిపారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు గురువారం విడవలూరులో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు మనిషి ఎదుగుదలకి అటంకాలన్నారు. అటువంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు, యువతీయువకులు దూరంగా ఉండాలన్నారు.

30న విడవలూరు మండల సమావేశం

విడవలూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నగేష్‌కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు ఆయా శాఖాధికారులు తప్పక హజరుకావాలన్నారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

వృత్తికే ఆదర్శం ఆయన!

● ఉపాధ్యాయ వృత్తిని వరంగా భావిస్తున్న హెచ్‌ఎం ● అంకితభావానికి చిరునామాగా ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ● నెలాఖరున పదవీ విరమణ

కోవూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చదువంటే కేవలం అక్షరాలు నేర్పడం కాదు... విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే పవిత్రమైన గురుతర బాధ్యత... ఆ బాధ్యతను నాలుగుదశాబ్దాలుగా తన జీవితంగా మలచుకున్నారు పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు. ఆయన నిబద్ధత, అంకితభావం నేటి ఉపాధ్యాయ తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. నాలుగు దశాబ్దాలు ఉపాధ్యాయ వృత్తికి అంకితమై ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న వెంకటేశ్వర్లు సాగించిన సేవను ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, పాటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు.

● విద్యాబోధనకు అంకితం

1985లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సాధారణ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన వెంకటేశ్వర్లు నాయుడు అంచెలంచెలుగా ఎదిగి 2021 అక్టోబరు 27న పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాయకత్వంలో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ఆయన దృష్టి కేవలం మార్కుల మీద కాకుండా విద్యార్థుల సమగ్ర వికాసంపై ఉంది. ఈ కృషి ఫలితంగానే పాటూరు పాఠశాల ఉత్తీర్ణత శాతంలో గణనీయమైన పురోగతి సాధించింది. వరుసగా నాలుగేళ్లు మండల స్థాయిలో పదో తరగతిలో పాటూరు పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు.2021- 22వ సంవత్సరంలో 64 ఉత్తీర్ణతాశాతం, 2022-23లో 54 శాతం, 2023-24లో 82శాతం, 2024-25లో 81 శాతం సాధించారు. ఉపాధ్యాయులను ప్రోత్సహించి, విద్యార్థుల పట్ల ప్రత్యేక శద్ధ తీసుకొని మార్గదర్శకుడిగా నిలిచి కోవూరు మండలంలో ప్రథమస్థానంలో నిలిపాడు. దీంతోపాటు వ్యాయామోపాధ్యాయుడు వెంకటరమణయ్యను పోత్సహించి, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చి జిల్లాస్థాయిలో గత రెండేళ్లుగా వరుసగా స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును సాధించారు.


● సేవే ధ్యేయంగా...

వెంకటేశ్వర్లు నాయుడు విద్యను ఉద్యోగంగా కాకుండా, పవిత్రమైన ధర్మంగా భావిస్తారు. ఆయన కేవలం పాఠశాలకే పరిమితం కాలేదు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. ఆయన శిక్షణలో ఎదిగిన ఎందరో విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో ఉన్నత స్థానాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని విద్యామార్గంలోకి తీసుకురావడానికి ఆయన చేసిన కృషిని అందరూ అభినందిస్తారు. భర్తకు తగిన సహచరిగా ఆయన భార్య శైలజ గోనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం అందించారు.



బడిబయట విద్యార్థులను బడిలో చేర్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లునాయుడు

విద్యాబోధన ఉద్యోగం కాదు... వరం !



విద్యాబోధన ఉద్యోగంకాదు. ఓ గొప్ప వరం. ఉపాధ్యాయుడి జీవితంలో వేలమంది విద్యార్థులను ప్రయోజకులుగా చేయవచ్చు. యువత ఉపాధ్యాయవృత్తిని ఎంచుకోవాలి. ఎందరినో ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి

- జీ వెంకటేశ్వర్లునాయుడు,ప్రధానోపాధ్యాయుడు, పాటూరు జడ్పీఉన్నత పాఠశాల

టీడీపీ మండలాధ్యక్షుడికి ఘన సన్మానం

మనుబోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్యను మనుబోలు టీడీపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. తిరుపతి పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి ఆధ్వర్యంలో మనుబోలు టీడీపీ నాయకులు బద్దెవోలులోని పొన్నూరు నివాసానికి చేరుకుని బొకే అందజేసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్లు, మారంరెడ్డి రమణారెడ్డి, చెల్లగిరి ప్రసాద్, రావుల అంకయ్య గౌడ్, గుంజి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): ఇటీవల స్థానిక అరుంధతీవాడకు చెందిన జనసైనికుడు బీ. వెంకటేశ్వర్లు అకాలమరణం చెందాడు. ఆయన కుటుంబానికి మనుబోలు జనసైనికులు గురువారం రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని నాయకులు బీ. సురేష్‌నాయుడు, పెనుబాక ప్రసాద్ ఆధ్వర్యంలో బాధితుడి ఇంటికి వెళ్లి అందజేశారు.

సర్వేయర్ల పెన్‌డౌన్
ఆగిన రీసర్వే పనులు

మనుబోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రేషన్‌లైజేషన్ ఆపాలంటూ సచివాలయాల్లో పనిచేసే విలేజ్ సర్వేయర్లు ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పెన్‌డౌన్ చేశారు. మండలంలో 10 మంది విలేజ్ సర్వేయర్లు ఉన్నారు. వీరంతా వీడూరు, మనుబోలు రీసర్వే పనులు చేస్తుండగా పెన్‌డౌన్‌తో ఆ పనులు నిలిచిపోయాయి. శుక్రవారం కూడా విధులకు హాజరుకాకుండా పెన్‌డౌన్ నిర్వహించనున్నారు.

టీడీపీ శ్రేణులు తిరుమలకు పాదయాత్ర



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

పొదలకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రిగా చోటుదక్కాలని అమ్మవారిపాలెం నుంచి కలియుగ దైవం (తిరుమల) వరకు గ్రామస్థులు గురువారం పాదయాత్ర చేపట్టారు. గ్రామ టీడీపీ నాయకులు అద్దంకి గిరినాయుడు ఆధ్వర్యంలో గ్రామం నుంచి సుమారు 200 మంది గ్రామ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తిరుమల శ్రీవారి దర్శనం కోసం మహా పాదయాత్రను మొదలు పెట్టారు. ఈ పాదయాత్రను సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, గ్రామ నాయకులు అద్దంకి గిరినాయుడు, కొమ్మి రమేష్‌బాబు, రావుపల్లి సురేష్‌నాయుడు, అద్దంకి తిరుపతినాయుడు, అద్దంకి శ్రీనివాసులునాయుడు, పులిపాటి సీతారామయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు వీఎస్‌యూలో మెగా జాబ్‌మేళా

● హాజరుకానున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం మెగా జాబ్ మేళా జరగనుంది. సోమిరెడ్డి ఫౌండేషన్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో 30కి పైగా కంపెనీలు పాల్గొననున్నాయి. 2 వేల మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళాకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హాజరై సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించనున్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఇంజనీర్, ఎంబీఏ, ఫార్మసీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం లభిస్తుందని, ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గ యువత కోసం సోమిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా చేపట్టినట్లు టీడీపీ నేతలు పేర్కొన్నారు.

కసుమూరు దర్గా హుండీ లెక్కింపు



డబ్బులు లెక్కిస్తున్న వక్ఫ్‌బోర్డు సిబ్బంది

వెంకటాచలం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు మస్తాన్ వలి దర్గా హుండీ లెక్కింపు గురువారం ఉదయం ప్రారంభమైంది. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ శాఖ సమక్షంలో గ్రామస్థులు, దర్గా ముజావర్ల పర్యవేక్షణలో మొత్తం 6 హుండీలను లెక్కించనున్నట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు ప్రక్రియ రెండురోజులపాటు కొనసాగే అవకాశం ఉందని దర్గా ఈవో షేక్ షరీఫ్ తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధికారి హుస్సేన్, జిల్లా ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ షరీఫ్, దర్గా కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ దగ్గరుండి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు.

మత్తుకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



మనుబోలు: జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు, పోలీసులు, విద్యార్థులు



ముత్తుకూరులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ రవినాయక్ తదితరులు

మనుబోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువ త మత్తుపదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభు త్వ జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జా తీయ మాదక ద్రవ్యాల, అక్రమ రవాణా నివా రణ దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై భవిష్యత్తును నాశ నం చేసుకోవద్దన్నారు. అనంతరం విద్యార్థులతో అధ్యాపకులు, పోలీసులు, న్యాయవాదులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి ప్రిన్సిపాల్ బీవి సులోచనారాణి, న్యాయవాదులు అరవ పార్వతయ్య, బాషా, లైజనింగ్ అధికారి డి మల్లిఖార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. మనుబోలులో సీఐ శివరామ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు.

●ముత్తుకూరు : మాదక ద్రవ్యాల మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కృష్ణపట్నం సీఐ రవినాయక్ సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా మత్స్య కళాశాల నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రవ లో కృష్ణపట్నం ఎస్‌ఐ జేపీ శ్రీనివాసులురెడ్డి, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పొదలకూరు : ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ, వైద్యాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు

●రాపూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాపూరు హెల్త్ సెంటర్ సూపరిడెంట్ సరస్వతి, డాక్టర్స్ నజ్మా, రేష్మ, ప్రిన్సిపల్ హనుమంతయ్య, అధ్యాపకులు, పాల్గొన్నారు.

●పొదలకూరు : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పార్లపల్లి సర్పంచ్ గూడూరు ప్రసన్న పాల్గొన్నారు. ఎస్‌ఐ హనీఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ హనీఫ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, డాక్టర్లు నస్మా, శివకృష్ణ, ఎక్సైజ్ ఎస్సై అంజయ్య, పోలీస్ స్టేషన్ సిబ్బంది రసూల్, ఇస్మాయిల్, ఫరీష్, తదితరులు పాల్గొన్నారు.

●సైదాపురం : మండల కేంద్రంలో ఎస్‌ఐ క్రాంతికమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ చేపట్టి, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీసులు, ఉపాధాయులు తదితరులు పాల్గొన్నారు.

● బుచ్చిలో జరిగిన ర్యాలీలో సీఐ శ్రీనివాసులురెడ్డి, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కండలేరు నీటిమట్టం 34.210 టీఎంసీలు

రాపూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కండలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలుకాగా, ప్రస్తుత నీటిమట్టం 34.210 టీఎంసీలు ఉందని కండలేరు డ్యామ్ ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో నీరు ఆగిపోగా, అవుట్‌ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2360 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 20 క్యూసెక్కులు మొత్తం 2450 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో అవుతుందని కండలేరు ఏఈ తెలిపారు.

భవనాలు లేక అంగన్‌వాడీ చిన్నారుల అగచాట్లు



మనుబోలు ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న అంగన్‌వాడీ చిన్నారులు

మనుబోలు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మనుబోలు మెయిన్ అంగన్‌వాడీ కేంద్రానికి స్వంత భవనం లేదు. చాలాకాలంగా ప్రాథమిక పాఠశాల లోనే కొనసాగిస్తున్నారు. ఈఏడాది ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్‌తో పిల్లల సంఖ్య పెరిగింది. దీంతో ఉన్న గదులు సరిపోకపోవడంతో అంగన్‌వాడీ చిన్నారులకు గది కొరత ఏర్పడింది. అలాగే కేఆర్‌పురంలో గమళ్ళపాళెం ప్రాథమిక పాఠశాల భవనం మూడేళ్ళుగా నిర్మాణంలోనే ఉంది. దీంతో అక్కడ విద్యార్థులు గత్యంతరం లేక అంగన్‌వాడీ కేంద్రంలో ఉంటూ చదువులు సాగిస్తున్నారు. వీటిపై పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

C.R.I.M.E N.E.W.S

రామతీర్థంలో ఇరువర్గాల ఘర్షణ

● పలువురికి గాయాలు, ఒకరికి తీవ్రం
● బ్రహ్మోత్సవాల్లో యువకుల మధ్య వివాదం



గాయపడిన శివరామ్

విడవలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో గురువారం శ్రీకామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో యువకుల మధ్య జరిగిన చిన్నపాటి వివాదం చినికిచినికి గాలివానగా మారి, రెండు గ్రామాల మధ్య ఘర్షణకి దారి తీసింది. సేకరించిన సమాచారం మేర కు రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో బా గంగా బుధవారం తీర్థవాది జరిగింది. ఈ క్రమంలో పాతూరుకి చెందిన యువకులకు, రామలింగాపురం యువకులకు మధ్య కొన్ని కారణాల వల్ల వివాదం నెలకొంది. ఈ వివాదం కాస్త పెద్దదిగా మారటంతో రామలింగాపురానికి చెందిన గ్రామకాపులు పాతూరుకి చెందిన కాపులతో వివాదానికి జరిగిన కారణాలపై మాట్లాడటం జరిగింది. కాపుల మధ్య సయోధ్య జరిగిన తరువాత రామలింగాపురానికి చెందిన కొందరు వ్యక్తులు పాతూరుకి వచ్చి ఇండ్లలో ఉన్న ముగ్గురు యువకులను దౌర్జన్యంగా తీసుకుని పోయారు. ఈ విషయం తెలుసుకున్న పాతూరు కాపులు, గ్రామస్థులు రామలింగాపురానికి వెళ్లి అక్కడ ఉన్న కాపులతో మీ గ్రామస్థులు చేయటం తప్పని వారించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన రామలింగాపురానికి చెందిన కొందరు పాతూరు గ్రామస్థులపై దాడి చేశారు. దీంతో పలువురికి స్వల్ప గాయాలు కాగా నెల్లూరుకి చెందిన శివరామ్‌కి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నరేష్‌కుమార్ యాదవ్ కేసు విచారణ చేపట్టారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

కావలి రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వెనుకవైపు రైలు పట్టాలపై పడి ఉన్న పొన్నాడి శ్రావణ్‌కుమార్(24) మృతదేహాన్ని గురువారం లోకో పైలెట్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని దిగువ మార్గంలోని రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా కావలి మండలం ఒట్టూరుకి చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడు తన ఆటోలో గ్రామం నుంచి కావలి వచ్చి, అక్కడ నుంచి జనసంచారం లేని ప్రాంతంలో ట్రాక్‌కు సమీపంలో ఆటో ఆపి చెప్పులు పక్కన వదిలిపెట్టి ఉన్నాడు. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు రైల్వే పోలీసులు నిర్ధారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడి తండ్రి జాలయ్య ఇద్దరు కుమారైలకు వివాహాలు చేసినా, అందరి దగ్గర అప్పులు చేసి, చీటీలు వేసి నగదు ఇవ్వకుండా తిరుగుతుంటాడని గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని తెలిపారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

నెల్లూరు (క్రైం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 24వ తేదీ తెల్లవారు జామున సుందరయ్య కాలనీ వద్ద జాతీయ రహదారి సమీపంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు ఆ ప్రాంత సచివాలయం వీఆర్వో ఉలవపాటి ప్రసాద్‌కు సమాచారమిచ్చారు. ఆయన అక్కడకు చేరుకుని సదరు వ్యక్తిని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. దీనిపై ప్రసాద్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని, ఎడమకన్ను, ఎడమ చెంపవద్ద వాచిన గాయాలు, ముక్కు గుండా రక్తం కారి ఉందని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు



తూము వద్ద బోల్తా పడ్డ ఆటో, పక్కన కూలీలు

సైదాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కలిచేడు వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అనంతమడుగు గ్రామం నుంచి పొదలకూరు మండలం కొనగలూరు సమీపంలో ఉన్న మైనింగ్ పనులకు 8మంది కూలీలతో ఆటో వెళుతున్న సమయంలో ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్పంగా గాయాలు కావడంతో పొదలకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ కాంతి కుమార్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారి శుధ్య కార్మికులు వేతనాలు చెల్లిం చాలని గురువారం వైద్యశాలకు వెళ్లే దారిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఫస్ట్ అబ్జెక్టు ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో వైద్యశాలలో ఎని మిది మంది పారిశుధ్య కార్మికులు విధు లు నిర్వహిస్తున్నారన్నారు. గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోష ణ భారమైందని వాపోయారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు విధులకు హాజర య్యేందుకు బస్సు చార్జీల నగదుకు సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు నెల్లూరు కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ అధికారిగా బదిలీ అయ్యారు. గురువారం ఆయనకు ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, గ్యారేజీ సిబ్బంది అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240

కోడిగుడ్ల ధర (100): 575

అభివృద్ధి పాలనకు ఏడాది పూర్తి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పాలనకు ఏడాది పూర్తి అయ్యిందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు తెలిపారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లో ఉన్న పార్టీ నగర కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనాసుర పరిపాలనకు ముగింపు పలికి ఎన్డీఏ కూటమి సుపరిపాలన మొదలుపెట్టి ఒక సంవత్సరం పూర్తయిందన్నారు. ఈ సంవత్సర కాలంలో జరిగిన ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జనసేన రాష్ట్ర కార్యాలయం పుస్తకాన్ని విడుదల చేసిందని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, గూడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మోహన్, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్, నగర ప్రధాన కార్యదర్శి శనివారపు అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం : ఎస్ఈ

నెల్లూరు(సిటీ), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగర పాలక సంస్థ ఎస్ఈ రామ్మోహన్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పొదలకూరు మండలం మహమ్మదాపురం నుంచి నెల్లూరుకు తాగునీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో ఆదురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మరమ్మతుల కారణంగా శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. శనివారం యథావిధిగా తాగునీటి సరఫరా కొనసాగు తుందని వెల్లడించారు. నగరవాసులు శుక్రవారం తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

తెలుగుభాషా ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వ్యావహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆగస్టు 29 నుంచి నెల్లూరు టౌనుహాలులో తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా రచయితలు, రచయిత సంఘాల కూటమి సహకా రంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించిన గోడ పత్రికలను ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్ కుమార్, ప్రముఖ రచయితలు డాక్టర్ పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకట సుబ్బయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు జిల్లేళ్ల బాలాజీ, గంగిశెట్టి శివకుమార్, సేవ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంబుబాచీ మేళా

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 : నగరంలోని మైపాడు రోడ్డులో ఉన్న డీజీపీ కల్యాణ మండపంలో గురువారం అంబుబాచీ మేళా భక్తిశ్రద్ధలతో జరిగింది. శ్రీకామాఖ్య త్రిశక్తి పీఠం పీఠాధిపతి మహేష్ మహరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మేళాలో ఉదయం అమ్మవారి ఆవాహన, కలశ స్థాపన, యంత్ర స్థాపన, సామూహిక కుంకుమార్చన జరిగాయి. అనంతరం చండీ పారాయణం, దశ మహా విద్య సహిత కామాఖ్య దేవికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం కామ్య సిద్ధి హోమం, గుమ్మడి కాయ, చెరకు, సొర కాయ, దోస కాయ, నిమ్మకాయలతో పంచ బలి కార్యక్రమం జరిగాయి.

రక్తదాన శిబిరం

నెల్లూరు(వెంకటేశ్వరపురం) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ, వైసీపీ సిటీ ఇన్‌చార్జి పీ చంద్రశేఖర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆ పార్టీ నగర కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నగరంలోని పలు డివిజన్లలో అన్నదానం, రక్తదానం, ఆలయాల్లో పూజలు చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ లేడీ రెప్రజంటేటివ్‌గా లక్ష్మమ్మ

నెల్లూరు (లీగల్), జూన్ 26 : నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్ లేడీ రెప్రజంటేటివ్‌గా ఐక్య వేదిక ప్యానల్ నుంచి పోటీ చేసిన బీ లక్ష్మమ్మ అలియాస్ లక్ష్మి ఎంపిక య్యారు.



ఇటీవల జరిగిన 'బార్ ఎన్నికల్లో లేడీ రిప్రజంటేటివ్ పదవికి వీసీ ఎస్ఆర్ ప్యానల్ నుంచి పోటీ చేసిన పీ రమాదేవికి, లక్ష్మమ్మకు సమానంగా ఓట్లు రావడంతో ఆ ఇద్దరి ఆమోదంతో ఎన్నికల అధికారులు ఇద్దరి పేర్లు డిప్ తీశారు. అం దులో లక్ష్మమ్మ పేరు రావడంతో అమెను విజేతగా ప్రకటించారు. సీనియర్ ఎగ్జిక్యూ టివ్ మెంబర్లుగా వీసీఎస్ఆర్ ప్యానల్ నుంచి విడవలూరు సారిక, పనబాక గంగరాజు. ఐక్య వేదిక నుంచి చలువాది జితేంద్ర ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు బీ శ్రీనివాసన్, సీవీ రత్నం ప్రకటించారు.

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం అందచేశారు. పలు అంశాలపై స్పీకర్‌తో మాట్లాడారు.



ఓం బిర్లాకు లడ్డూలిస్తున్న వేమిరెడ్డి

ఇవి ఎవరివి... ఎందుకిలా?



నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన శిథిల వాహనాలు కనిపిస్తున్నాయి. ఇవి ఏళ్ల తరబడి ఒకేచోట ఉన్నాయి. చుట్టు పక్కల వారు ఇళ్లలో వాహనాలు పెట్టుకునేందుకు స్థలం లేక ఇలా రోడ్డు మీద పెట్టారా.. లేక రోడ్లపై వాహనాలను వదిలేశారా? అనేది తెలియడం లేదు. ఇలాంటి వాహనాలు రోజురోజుకు శిథిలమవుతున్నాయి. కొన్ని వాహనాల్లో మట్టి పేరుకుపోగా, మరికొన్ని వాహనాల విడిభాగాలు మాయమవుతున్నాయి. ఈ విధంగా రోడ్లపై వదిలేసిన వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా తయారవుతున్నాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించాల్సిన అవసరం ఉంది.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఉడ్ కాంప్లెక్స్‌లో..





ఉడ్ కాంప్లెక్స్‌లో పిచ్చి మొక్కల మధ్య వదిలేసిన ట్రాక్టర్, డోర్లు, గ్లాసులు దెబ్బతిని అధ్వానంగా మారిన వ్యాను.



నగరంలో బృందావనంలోని ఇందిరాభవన్ పక్క వీధిలో ఏళ్ల తరబడి నిలిపిన కారు. రోడ్లపై వ్యర్థాలతో పూడిపోయిన కారు టైర్లు

కోవూరు సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భేటీ

నెల్లూరు(హరనాథపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. ఆమె కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్‌తో భేటీ అయ్యారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పరిష్కరించాలంటూ ఆ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిల చెల్లింపుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పెన్నాడెల్టా చైర్మన్ జట్టి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



క్రీడా కిట్లు పంపీ చేస్తున్న ప్రశాంతిరెడ్డి

● **క్రీడా కిట్ల పంపిణీ**

వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ వికాస్ కార్యక్రమం కింద కొడవలూరు మండల యువతకు గురువారం క్రీడా కిట్లను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పంపిణీ చేశారు. నగరంలోని ఆమె నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో 30 మందికి క్రికెట్ కిట్లు, 35 మందికి వాలీబాల్ కిట్లు అందజేశారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని కోరారు.

డీఎస్ఏ సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను పంపిణీ చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చింతల అమరేంద్రరెడ్డి మాట్లాడుతూ స్టేడియంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 15 మంది సిబ్బందికి అసోసియేషన్ సభ్యుడు పాతపాటి విజయమోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిత్యావ సరాలు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

గుండెపోటు నివారణ మాత్రల పంపిణీ

ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియంలో గురువారం గుండెపోటు ప్రాథమిక చికిత్స మాత్రలను వాకర్స్‌కు ఉచితంగా పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులు నాయుడు తెలి పారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాసరాజు సూచనలతో శుభమస్తు షా పింగ్‌మాల్ అధినేతలు బయ్యా వాసు, బయ్యా రవి సహకారంతో 500 ప్యాకెట్లను వాకర్స్‌కు అందించామని చెప్పారు.

ఇష్టపడి పనిచేయాలి : వెటర్నరీ డీడీ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జంతు ప్రేమికులకు, రైతులకు అందుబాటులో ఉండాలని, ఇష్టపడి పని చేయాలని వెటర్నరీ పాలీ క్లీనిక్(వీపీసీ) ఉప సంచాలకుడు డాక్టర్ టీ సోమయ్య సూచించారు. నగరంలోని వీపీసీలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన, కొత్తగా బాధ్యతలు చేపట్టిన వెటర్నరీ సిబ్బందికి గురువారం జిల్లా పశువైద్యాధికారి కార్యాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో సన్మాన, వీడ్కోలు కార్యక్రమం జరిగింది. బదిలీపై వెళ్లిన లైవ్ స్టాక్ సహాయకుడు వెంకటేశ్వర్లు, ఆఫీస్ సబార్డినేట్ అభిలాష్, ద్రాక్షాయని, ప్రశాంత్‌సింగ్ పనితీరును డీడీ కొనియాడారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పశుగణ సహాయకుడు సజ్జాద్ అహ్మద్, ఆఫీస్ సబార్డినేట్ స్వర్ణలత, వెంకటేశ్వర్లు, కుమార్‌కు అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ ఎం మాలకొండయ్య, డాక్టర్ జీ కృష్ణమూర్తి, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ టీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న వారితో డీడీ సోమయ్య తదితరులు

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగరంలో మినీ బైపాస్‌రోడ్డులో ఉన్న ప్రాఫిట్ షూ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పురస్కారాలు అందచేశారు. కార్యక్రమానికి అతిథిగా ట్రాఫిక్ ఎస్ఐ చంద్రమౌళి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల పిల్లలకు దీటుగా రాణి స్తున్నారన్నారు. వారిని ప్రోత్సహిస్తూ పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ బీఎస్ కోటేశ్వరరావు, మేనేజర్ వెంకటేష్, ఏరియా మేనేజర్ వెంకటేష్, సిబ్బంది చంద్ర, బాషా, లోకేష్, తేజస్విని పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

29న క్షత్రియ విద్యార్థులకు....

నెల్లూరు(హరనాథపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ చూపిన అగ్నికుల క్షత్రియ, వన్నియ కుల క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందచేస్తున్నామని అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు చమ్మండి రాము, ప్రధాన కార్యదర్శి తిరువత్తూరు శివశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న ఉదయం 9 గంటలకు మూలాపేటలోని శ్రీవీరశైవ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నీట్ ర్యాంకర్లకు కూడా ఈ పురస్కారాలు అంద చేస్తామని ప్రకటించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ● జీజీహెచ్‌లో యాంటీ డ్రగ్ డే ప్రదర్శన

నెల్లూరు (వైద్యం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హెచ్చరించారు. గురువారం యాంటీ డ్రగ్ డే సందర్భంగా నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నవజీవన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ తీసుకుంటున్న వారిని గుర్తించి వారికి ఓఎస్‌డీ ఇంజక్షన్ ద్వారా డ్రగ్స్ బానిసత్వం నుంచి త్వరగా కోలుకునేలా నవజీవన్ సంస్థ చూస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు



జీజీహెచ్‌లో జరిగిన ప్రదర్శనలో డీఎంహెచ్‌వో, అధికారులు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట,ఆంధ్రజ్యోతి): నేర రహిత సమాజం కోసం డ్రగ్స్ వాడినా, డ్రగ్స్ చూసినా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రతీ ఒక్కరూ ప్రతిన పూనాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. నగరంలోని 9వ డివిజన్‌లో గురువారం చాయ్ విత్ జనసైనిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు సే నో టు డ్రగ్స్ అంటూ ప్లకార్డులతో మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కిషోర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కి దూరంగా ఉంటూ డ్రగ్స్ మహమ్మారిని దేశం నుంచి తరిమి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, కేదారి మనోజ్, జమీర్, శ్రీరామ్, ప్రశాంత్ గౌడ్, గుర్రం కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లు, భవనాలకు అనుమతులు తప్పనిసరి

● కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), జూన్26,(ఆంధ్రజ్యోతి) : నగరంలో భవన నిర్మాణాలకు, కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. గురువారం మూలాపేట, ఖుద్దూస్‌నగర్, నవాబులవీధి, మినీ బైపాస్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాలు, నిబంధనలు అతిక్రమించిన కట్టడాలను గుర్తించాలని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్, టిడ్కో అధికారులతో సమీక్ష జరిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

అతిసార నుంచి పిల్లలను రక్షించండి

● వెంగళరావు నగర్ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రీనా భారతి

నెల్లూరు (వైద్యం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అతిసార వ్యాధిపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని, ఆ వ్యాధి నుంచి పిల్లలను రక్షించాలని వెంగళరావునగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రీనా భారతి సూచించారు. ఈ ఆరోగ్య కేం ద్రం పరిధిలోని ఎన్‌టీఆర్ కాల నీలో పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం అతి సారపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. వైద్యురాలు మాట్లాడుతూ వ్యక్తిగత, పరి సరాల పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కో ఆర్డినేటర్ కొండాపురం వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ జయలక్ష్మి, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

145 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతు లు మొత్తం 566పొగాకు బే ళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్ర తినిధులు పాల్గొని 421బేళ్లు కొనుగోలు చేశా రు. నోబిడ్-122, ఆర్ఆర్-12, సీఆర్-4, జం పింగ్‌లాట్స్-7 కారణాలతో 145బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.221.94గా నమోదైనట్లు వేలం నిర్వహ ణాధికారి శివకుమార్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వలేటివారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులు, స న్నజీవాల పెంపకందారులు సీజ నల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ ఎంతోటి చెన్నకేశవులు తెలిపారు. వలేటివా రిపాలెంలో టీడీపీ నాయకులతో క లిసి గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపె ట్టిన పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదా ల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, కాకుమాను ఆంజనేయులు, కాకుమాను మాల్యాద్రి పాల్గొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి

దగదర్తి (బిట్రగుంట), జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలోని జగనన్న కాలనీలు, పక్కాగృహ నిర్మాణాలను జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ గురువారం సందర్శించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారుడికి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని అధికా రులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఆర్థిక అదనపుభారం కలుగ కుండా ఇళ్లనిర్మా ణం పూర్తి అయేలా చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 1లో లక్షా 40 వేల ఇళ్లు మం జూరు అయినట్లు తెలిపారు. అందులో 30 వేల ఇళ్లు పూర్తి కాగా 22 వేలు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ హేమంత్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్థానికులు ఉన్నారు.



పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

అక్రమ ప్రార్థన మందిర నిర్మాణం కూల్చివేత

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని సీతమ్మ చలివేంద్రం దేవదాయ శాఖ భూమిలో అక్రమంగా నిర్మించిన అన్యమత ప్రార్థన మందిరాన్ని దేవదాయ శాఖ, పోలీసు, రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. దేవదాయ శాఖకు చెందిన సర్వే నెం. 667/3లోని 2సెంట్ల భూమిలో రాత్రికి రాత్రి ఓ ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. ఈ విషయమై ఈఓ వై.మాధవి, పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.జనార్థన్‌రెడ్డి తన సిబ్బందితో అక్రమంగా నిర్మిస్తున్న ప్రార్థన మందిరాన్ని పరిశీలించారు. ప్రస్తుతం మందిర నిర్మాణం జరుగుతున్న సీతమ్మ చలివేంద్రం దేవదాయ శాఖ భూమి గత ప్రభుత్వంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి దేవదాయ శాఖ అధికారులు అభ్యంతరం తెలిపినా జగనన్న కాలనీకి దాదాపు 10 ఎకరాలకు పైగా 730 పట్టాలు ఇచ్చారు.

జగనన్న లేఅవుట్లకు అనుకొని ఉన్న దేవదాయ శాఖ భూమిలో 2సెంట్ల విస్తీర్ణం ఆక్రమించి అన్యమత ప్రార్థన మందిరం నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా దేవదాయ సహాయ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రార్థనా మందిరానికి అనుమతి లేదని, ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తొలగింపులో వివిధ దేవస్థానాలకు చెందిన ఈఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీకి వచ్చిన వారంతా పరుగో పరుగు


ఫ్లెక్సీయే మాకు రక్ష

అమ్మో.. తేనెటీగలు!

అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ చేపట్టేందుకు అధికారులు, పోలీసులు, విద్యార్థులు నగరంలోని సర్వోదయా కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. ఇక ర్యాలీ ప్రారంభం అవుతుందన్న దశలో తేనేటీగలు ఒక్కసారిగా దాడి చేయడంతో వచ్చిన వారంతా పరుగులు తీశారు. కొందరు ప్లకార్డులు, ఫ్లెక్సీలను అడ్డుపెట్టుకోగా మరికొందరు మైదానం నుంచి ప్రధాన రోడ్డులోకి పరుగులు తీశారు. అయితే, ఎవరికీ ఎలాంటి హానీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)

వీఆర్ హైస్కూల్లో 30 నుంచి తరగతులు


మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆధునీకరించిన వీఆర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆ రోజున 6 నుంచి 9 తరగతుల వరకు బోధన ప్రారంభిస్తారని, జూలై 2వ తేదీ 1 నుంచి 5 తరగతులకు, 3వతేదీ నర్సరీ తరగతులు ప్రారంభమవుతాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. జూలై 6వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా పాఠశాలను ప్రారంభించేలా సన్నహాలు చేస్తున్నామని తెలిపారు. ఆ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం మంత్రి పరిశీలించారు. వీఆర్ హైస్కూల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరిస్తున్నామని, పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు. పాఠశాలలో అడ్మిషన్ కోసం ఇప్పటి వరకు ఐదు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 1500 మంది నిరుపేద విద్యార్థులకే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాల తరహాలోనే నగరంలోని మరో 11 హైస్కూల్స్‌ను ఏడాదిలోపు సిద్ధం చేస్తామని, నాలుగేళ్లలో అన్నీ స్కూల్స్‌ను ఆధునీకరిస్తామని మంత్రి ప్రకటించారు. దేశంలోనే నెల్లూరు స్కూల్స్‌ను మోడల్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, వీఆర్ విద్యా సంస్థల ప్రత్యేక అధికారి కే కార్తీక్, మునిసిపల్ కమిషనర్ నందన్, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.


ఈవీఎం గోదాము వద్ద కలెక్టర్ ఆనంద్, ఆర్డీవో అనూష, అధికారులు, నాయకులు

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలి

● కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ట భద్రత ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. నెల్లూరు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోదాములను గురువారం ఆయన పరిశీలించారు. గోదాముల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, ఏవో నిర్మలానందబాబా, తహసీల్దారు షఫీ మాలిక్, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెల్లూరులోని ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ వీ తనూజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జూలై - 2025 నుంచి ప్రారంభం కానున్న విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పీజీ, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమో, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు జూలై 15లోపు www.igno.ac.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరులోని వీఆర్ పీజీ స్టడీ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో స్టడీ సెంటర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

3న ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక జూలై 3న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి బీ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగే ఈ ఎంపికలకు సంబంధిత తేదీలో సాయంత్రం 3 గంటలకు క్రీడాకారులు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు స్టేడియంలో సంప్రదించాలని కోరారు.


పడమటిపాళెంలో పనిచేయని సోలార్ నీటి పథకం

సోలార్ నీటి పథకం..

గ్రామాల్లో ఎంతో ఉపయోగం

పునరుద్ధరిస్తే బెటర్!

● 2017లో టీడీపీ హయాంలో ఏర్పాటు ● వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ కరువు
● రూ.లక్షల ప్రజాధనం వృథా ● వినియోగంలోకి తెస్తే పల్లెజనానికి తీరనున్న దాహం

సంగం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : సోలార్ వినియోగం ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. ఇంటింటా సౌర వ్యవస్థను తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఎప్పటినుంచో ఉన్న వ్యవస్థను నీరుగార్చుతుండటం విమర్శలకు తావిస్తోంది. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిన సోలార్ నీటి పథకాన్ని అమలులోకి తెచ్చింది. నాడు ఉమ్మడి జిల్లాలో 2,622 హ్యాబిటేషన్లు ఉండగా అందులో మొదటిగా నీటి సమస్య ఉన్న 107 చోట్ల మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రయోగాత్మకంగా సోలార్ నీటి పథకాన్ని తీసుకొచ్చారు. సంగం, బోగోలు, కొండాపురం, వింజమూరు, నాయుడుపేట, విడవలూరు, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, చిట్టమూరు తదితర 37 మండలాల పరిధిలో సోలార్ నీటి పథకాలు ఏర్పాటుకు ఒక్కోదానికి రూ.7.5 లక్షల చొప్పున తొలి విడతగా సుమారు రూ.5.24కోట్లు మంజూరు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ కంపెనీకి ఏర్పాటు బాధ్యతలను అప్పగించి, పూర్తి చేశారు.

● **వైసీపీ హయాంలో నిర్లక్ష్యం**

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సోలార్ పథకంపై నిర్లక్ష్యం వహించింది. చిన్ని చిన్న మరమ్మతులను కూడా అప్పటి అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో సోలార్ నీటి పథకాలు చాలా చోట్ల మూలకు చేరాయి. సంగం మండలంలోని పడమటిపాళెం, వీర్లగుడిపాడులోని సోలార్ నీటి పథకాలు కూడా మరమ్మతులకు గురై ఈ కోవలోకే చేరాయి. దీంతో రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన సోలార్ నీటి పథకాలను నిరుపయోగంగా వదిలేశారు. వాటి స్థానంలో కొన్నిచోట్ల జలజీవన ధార పథకంలో ఇంటింటికి కొళాయిలు వేశారు. మరికొన్ని చోట్ల చేతి పంపుల మీదనే ప్రజలు ఆధారపడి నీటి అవసరాలు తీర్చుకొంటున్నారు.

● **ప్రభుత్వం దృష్టి సారించేనా..?**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. నాడు తెలుగుదేశం హయాంలో చేపట్టి విజయవంతంగా సాగిన సోలార్ నీటి పథకాలు నేడు మూలకు చేరాయి. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం సూర్యఘర్ పథకంలో ఇంటింటికి సౌర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నాయి. దరఖాస్తుదారులకు రాయితీలు, బ్యాంకు రుణాలు అందజేస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విజయవంతమైన సోలార్ నీటి పథకాల వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మారుద్దాం!

● ఎస్పీ కృష్ణకాంత్ పిలుపు


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎస్పీ జి కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ నుంచి కస్తూర్బా కళాక్షేత్రం వరకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ముందుగా ఈ ర్యాలీని జేసీ కార్తీక్‌తో కలిసి ఎస్పీ ప్రారంభించారు. కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్లకార్డులు, నినాదాలతో మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన సభలో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల అనర్థాల గురించి, వాటిని ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాల గురించి యువత తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలపై సమాచారం ఇవ్వడానికి ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటు చేసిందన్నారు. యుక్త వయస్సులో చెడు వ్యసనాలకు బానిసై భావిష్యత్తును పాడు చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాసులునాయుడు, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, ఆర్‌ఐఓ వరప్రసాద్, డ్రగ్ ఎడిషన్ నిర్వాహకులు రవీంద్ర, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి ఆయూబ్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం.. సంపూర్ణమయ్యేనా..?

● సత్ఫలితాలనిచ్చిన అక్షర చైతన్య కార్యక్రమం
● రెండు విడతల్లో 1.6 లక్షల మంది ఉత్తీర్ణత
● మూడో విడతలో మరో 2 లక్షల మంది గుర్తింపు
● కార్యక్రమం కొనసాగిస్తే నిరుద్యోగులకు జ్ఞానం

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వయోజన విద్య కార్యక్రమానికి గత ప్రభుత్వంలో బ్రేకులు పడ్డాయి. ఆ క్రమంలో జిల్లా కలెక్టర్‌గా ఉన్న కేవీఎన్ చక్రధర్‌బాబు 'అక్షర చైతన్యం' పేరుతో జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని 46 మండలాల్లో 2021, ఆగస్టు 16న కలెక్టర్ నిధులతో అక్షర చైతన్యం-1 కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలో 1,33,438 మంది నిరక్షరాస్యులను గుర్తించి, ఐదు నెలలపాటు విద్య నేర్పించారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2022, జనవరిలో వీరికి పరీక్ష నిర్వహించారు. 1.24 లక్షల మంది పరీక్ష రాయగా 1.16 లక్షల మంది ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు ప్రకటించారు. అప్పటివరకూ 69 శాతంగా ఉన్న జిల్లా అక్షరాస్యత 84 శాతానికి పెరిగినట్లు వెల్లడించారు. ఆ తర్వాత 2022లో గాంధీ జయంతి (అక్టోబరు 2న) రోజున అక్షర చైతన్యం-2 కార్యక్రమం మొదలైంది. ఈ దఫా జిల్లాలోని 37 మండలాల్లో 51,745 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి విద్యను నేర్పించి పరీక్షలు నిర్వహించారు. 45,229 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో జిల్లా అక్షరాస్యత 93 శాతానికి చేరినట్లు అధికారులు ప్రకటించారు.

● **సంపూర్ణం కావాలి..!**

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాకు కలెక్టర్‌గా వచ్చిన ఆనంద్.. నూరు శాతం అక్షరాస్యత సాధించే దిశగా ఆలోచన చేశారు. సంపూర్ణ అక్షరాస్యత కోసం అక్షర చైతన్యం-3 కార్యక్రమం చేపట్టేందుకు నిరక్షరాస్యుల గుర్తింపు మొదలుపెట్టారు. జిల్లాలో సుమారు రెండు లక్షల మంది వరకూ నిరక్షరాస్యులు మిగిలి ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. అయితే అక్షర చైతన్యం-3 మొదలుపెట్టేలోపు రాష్ట్ర ప్రభుత్వం వయోజనులకు విద్యను నేర్పించే ఉల్లాస్ పథకాన్ని పునరుద్ధరించింది. దీంతో అక్షర చైతన్యం-3 పథకానికి బ్రేకులు పడ్డాయి. గతేడాది ఈ పథకం కింద 19 వేల మందికి మాత్రమే విజ్ఞానాన్ని నేర్పించారు. ఇదే రీతిలో చేస్తే జిల్లాలోని వారందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా చేయడానికి మరో పదేళ్లకుపైగా సమయం పడుతుంది. అయితే ఇప్పటికే అక్షర చైతన్యం కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా జరిగింది కాబట్టి ఇదే కార్యక్రమాన్ని మూడో విడత చేపడితే సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు వీలు పడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఈదఫా అక్షర చైతన్యం కార్యక్రమం నిర్వహణకు పలువురు దాతలు కూడా ముందుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కృతనిశ్చయంతో అక్షర చైతన్యం-3 కార్యక్రమాన్ని పూర్తి చేయగలిగితే నిరక్షరాస్యులను విజ్ఞానవంతులుగా మార్చే అవకాశం కలుగుతుంది.

- నెల్లూరు(ఆంధ్రజ్యోతి)

లోగ్రేడు పొగాకుకు దక్కని మద్దతు

● నోబిడ్‌లతో కొనుగోలు చేయని కంపెనీలు
● సాగుదారుల్లో ఆందోళన


నోబిడ్‌లతో వేలం కేంద్రం నుంచి వెనక్కి వెళ్తున్న లోగ్రేడ్ పొగాకు బేళ్లు

కలిగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను బట్టి పొగాకు కొనుగోళ్లు జరగనున్న నేపథ్యంలో ఈ ఏడాది లోగ్రేడు పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మూడేళ్లుగా మార్కెట్ అనుకూలించడంతో రికార్డుస్థాయిలో ధరలు దక్కాయి. దీంతో ఈ ఏడాది కూలీలు, రవాణా, పెట్టుబడులు అమాంతంపెరిగిపోవడంతో గతేడాది కన్నా 30 శాతం మేర ఖర్చులు పెరిగిపోయాయి. దీనికితోడు పొగాకు బోర్డు అనుమతించినదానికంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి అధిక ఉత్పత్తి సాధించారు.

ఈ ఏడాది ప్రారంభంలో మేలిమి పొగాకు ధర కిలో రూ.280, లోగ్రేడ్ పొగాకు రూ.220 పలికింది. అయితే ప్రారంభంలో లోగ్రేడుకు దక్కిన మద్దతు ధర క్రమేపి తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రూ.160లకు చేరుకుంది. దీంతో రైతులు ధరలు పతనమవుతుండటంతో ఉన్న ధర అందినా చాలనుకొని ఇళ్ల వద్ద ఉన్న లోగ్రేడు పొగాకును కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తున్నారు. ఇప్పటివరకు గరిష్ఠ ధరలో మార్పు లేకుండా కొనుగోళ్లు జరుగుతుండటం, లోగ్రేడు పొగాకుకు మద్దతు ధర తగ్గించడంతోపాటు ఎక్కువశాతం కొనుగోలు చేయకుండా నోబిడ్ ప్రకటిస్తూ వెనక్కి తిప్పి పంపడం జరుగుతోంది. వ్యయప్రయాసలతో వేలం కేంద్రానికి తీసుకువచ్చిన పొగాకును తిరిగి ఇంటికి తీసుకు వెళ్లాలంటే శ్రమతోపాటు రవాణా ఖర్చు అవుతుందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు గణనీయంగా పెరగడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ ఏడాది ఎక్కువశాతం లోగ్రేడు పొగాకు దిగుబడి వచ్చిందని, ధరలు లేకపోవడంతో గడ్డుపరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. లోగ్రేడ్ పొగాకు ధరలు పెరగకపోతే తీవ్రంగా నష్టపోతామని ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కంపెనీలు ముందుకు రావడం లేదు.

అంతర్జాతీయ మార్కెట్‌లో లోగ్రేడ్ పొగాకుకు డిమాండ్ లేకపోవడంతో కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి.

- శివకుమార్, వేలం నిర్వహణాధికారి, కలిగిరి.



ఆదమరిస్తే అంతే..!

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుబోయమడగల - వరికుంటపాడు గ్రామాల సమీపంలోని 5వ నంబరు కాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. రహదారి నిర్మించే సమయంలో అక్కడి వాహనాలు వంతెనను ఢీకొనడంతో కొంతమేర రక్షణ గోడ కూలిపోయింది. దీంతో సూచిక బోర్డులు ఏర్పాటుచేసి అధికారులు చేతులు దులుపుకున్నారని, రోజురోజుకు ఇరువైపులా ఉన్న గోడలు మరింత ధ్వంసమవుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు ఆప్రాంతంలో ప్రమాదకర మలుపు ఉండడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. పలు గ్రామాల ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ఆమార్గంలో ప్రతినిత్యం మోటారుబైకులు, ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తుండడంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఎదురు వాహనాలను తప్పించే క్రమంలో ఏమాత్రం ఆదమరిచినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన వంతెనపై పూర్తి స్థాయిలో రక్షణ గోడలు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించండి

● పరిశ్రమల ఏర్పాటుకు త్వరగా అనుమతులు : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. ఈ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సింగిల్ డెస్క్ పోర్టల్ విధానాల్లో 973 దరఖాస్తులు రాగా 856 దరఖాస్తులను అనుమతించినట్లు చెప్పారు. ఈ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్, బుచ్చి - దగదర్తి రోడ్డు, గిలకపాడు వీరాయపాళెం నీటి పైపులైన్‌కు సంబంధించి భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలన్నారు. రామాయపట్నంపోర్టు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూ వివరాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, ఆర్డీవోలు అనూష, వంశీకృష్ణ, పావని, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్ పాల్గొన్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

దుత్తలూరులో పాఠశాల తనిఖీ

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం కావలి డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతోపాటు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9337
వెండి కిలో ధర	రూ. 110500
వెండి ఒక గ్రాము	రూ. 113.50

న్యూస్ బాక్స్

వైభవంగా 16 రోజుల పండుగ



ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాలమ్మ అమ్మవారు

ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవిపేరంటాలమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగిసి గురువారానికి 16 రోజులైన సందర్భంగా భక్తులు వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీలోని అన్ని గ్రామాల మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రిని బుట్టల్లో ఉంచుకుని గ్రామాల పురవీధుల గుండా మేళతాళాల నడుమ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆత్మకూరు ఆర్టీసీ డీఎంగా శివకేష్ యాదవ్

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఆర్టీసీ నూతన డీఎంగా శివకేష్ యాదవ్ నియమితులయ్యారు. ఆయన గురువారం ఆత్మకూరుకు విచ్చేసి బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, పలువురు ఆర్టీసీ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు

ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, సీతారామపురం మండలాల్లోని వాగుల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపట్టి తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని జలవనరుల శాఖ డీఈఈ చంద్రమౌళి గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గండిపాళెం జలాశయం ముంపు ప్రాంతం, పిల్లాపేరు వాగుల్లో కొంతమంది ఎక్స్‌కవేటర్ల సహాయంతో ఇసుక తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇసుక అవసరమైన కూలీల ద్వారా తరలించుకోవాలన్నారు. యంత్రాల ద్వారా ఇసుక తరలిస్తే వాగుల్లో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతాయన్నారు. యంత్రాలతో ఎవరైనా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని ఆయన కోరారు.


రైతుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సీతారామపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా తమకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చిన్నాగంపల్లి మాజీ సర్పంచ్ మాలకొండయ్య ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తల్లికి వందనంతో పాటు పలు సంక్షేమ పథకాలు దక్కలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

టీడీపీ నేత కుటుంబ సభ్యులకు పరామర్శ



చండ్రా మంగమ్మను పరామర్శిస్తున్న గూటూరు

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆత్మకూరు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు మాదాల మస్తాన్‌నాయుడు కుటుంబ సభ్యులను గురువారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు పరామర్శించారు. ఆయన మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ చండ్రా మంగమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె భర్త అనారోగ్యంతో మరణించడం బాధాకరమని అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దావా పెంచలరావు, చండ్రా వెంకటసుబానాయుడు, చెరుకూరు తిరుపతినాయుడు, నరేష్, రజని తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



సంగం : ముంబాయి జాతీయ రహదారి కూడలిలో విద్యార్థుల మానవహారం

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని, యువత వీటి జోలికి వెళ్లకుండా ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని డీఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధర్ కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తు విద్యార్థులతో కలిసి పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, టీడీపీ నేతలు ఆత్మకూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాలకు, మత్తుకు యువత బానిస కావద్దంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తుమ్మల చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, ఎక్సైజ్ సీఐ వెంకటరమణమ్మ, ఎస్ఐలు షేక్ జిలాని, సాయిప్రసాద్, ప్రభుత్వ అర్బన్ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ అస్మా, క్రెడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, పలువురు పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **సంగం:** స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ నుంచి ముంబాయి జాతీయ రహదారి కూడలి వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం, విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం, యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు, బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం కూడలిలో విద్యార్థులచే మానవహారం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నేతాజీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మదార్‌బాష, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

● **ఉదయగిరి:** మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి అంజయ్య, సీఐ వెంకటరావులు సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, పలు శాఖల అధికారులు, న్యాయవాదులతో కలిసి రంగనాయకులస్వామి ఆలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. అలాగే స్థానిక మేకపాటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్ నారాయణస్వామి ఆధ్వర్యంలో నషా ముక్తి భారత్ అభియాన్ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీను, ఆదిలక్ష్మి, శివకృష్ణారెడ్డి, రఘు నాథ్, సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్, వైద్యాధికారి శివకల్పన, రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, న్యాయవాది సందిరెడ్డి రామారావు, పలు శాఖల అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సైదులు సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన స్థానిక ఠాగూర్ పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ రమణరెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరికుంటపాడు (ఉయగిరి రూరల్), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో గురువారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ నారాయణ, వీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పాఠశాలలను సందర్శించిన నాయకులు ఉపాధ్యాయుల చేత సభ్యత్వం నమోదు చేయించి రశీదులను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మొత్తం 167 మంది ఉపాధ్యాయులకు గాను 123 మంది సభ్యులుగా చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ కరీముల్లా, జిల్లా ప్రతినిధి ఆర్ నాగార్జున, నాయకులు హరిశ్చంద్రప్రసాద్, వడ్లమూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్



సభ్యత్వం తీసుకొంటున్న ఉపాధ్యాయులు

అనంతసాగరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కరీంమొహిద్దీన్ డిమాండ్ చేశారు. గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపల్లి, రేవూరు, పాతదేవరాయలపల్లి పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ డీఏ బాకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మహబుబ్‌బాష, సందాని పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎంపిక

ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రతిఒక్కరికీ ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గన్నేపల్లి గ్రామంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 7వ తేదీన ప్రతి మాదిగ పల్లెలో ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేయాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అంబేడ్కర్, బాలగురవయ్య, మరియదాసు, అశోక్, హజరత్, సురేష్, వెంకటేష్, పెంచలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఉదయగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. గురువారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దనే రేషన్ ఇవ్వాలి

సీతారామపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లవద్దకెళ్లి రేషన్ పంపిణీ చేయాలని స్థానిక తహసీల్దార్ డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు నాలుగు రోజులు ముందుగానే జూలై నెల రేషన్ ఇళ్ల వద్దకెళ్లి పంపిణీ చేయాలని, ఈ కేవైసీ గడువు నెలాఖరు వరకు ఉన్నందున డీలర్ల వద్ద పూర్తి చేసుకోవాలని తెలిపారు. రేషన్ షాపుల నిర్వహణలో డీలర్లు సమయపాలన పాటించి సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలన్నారు.

ఏపీ పీజీ సెట్‌లో డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని బీ నాగరాణి పీపీజీ సెట్-2025లో ఫిజిక్స్ సబ్జెక్టులో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ నారాయణస్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ విక్రమ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావులు నాగరాణికి అభినందనలు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో మహిళా సర్పంచులదే కీలక పాత్ర



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధిలో మహిళా సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన మహిళా సర్పంచ్‌లకు స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత, గ్రామీణాభివృద్ధి దిశగా మార్పుపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మహిళా సర్పంచులలో ఆత్మస్థైర్యం నింపి, వారి విధులు, బాధ్యతలను గుర్తు చేసి నాయకత్వ పటిమను పెంపొందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. గ్రామాల్లో మౌలికవసతుల మెరుగుదలకై అధికారులను సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఎంటీలు ఏవై శివ, మహ్మద్ జిలానీబాగ్, పి శ్రీవిద్య మహిళా సర్పంచులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో రమణయ్య, ఎంపీడీవో పి రఫీఖాన్, అబ్జర్వర్ ఏ ప్రసాద్ పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆత్మకూరు పట్టణ టీడీపీ ఎన్నికల పరిశీలకులు మహమ్మద్ జాఫర్ షరీఫ్

ఆత్మకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో తెలుగుదేశం పార్టీ పటిష్టతకు నేతలు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర టీడీపీ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్, పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి కోరారు. ఆత్మకూరు పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం నూతన కమిటీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఒకటవ వార్డు అధ్యక్షునిగా కోయి సురేష్, 2వ వార్డు అధ్యక్షునిగా శివకోటారెడ్డి, 6వ వార్డు అధ్యక్షునిగా దోర్నాదుల సురేష్‌బాబు, 12వ వార్డు అధ్యక్షులుగా నాగభూషణమ్మ, 13వ వార్డు అధ్యక్షునిగా శ్రీకాంత్‌నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి తోడేటి వెంకటయ్య, టీడీపీ నేతలు జి బుజ్జిరెడ్డి, సాగర్, ఆయా వార్డుల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి పల్లెలో ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు

సీతారామపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూలై 7న ప్రతి పల్లెల్లో ఆత్మ గౌరవ పతాకాన్ని ఎగురవేయాలని ఎమ్మార్పీఎస్, ఎం ఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంద వెంకటేశ్వరరావు అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల పరిధిలోని మారంరెడ్డిపల్లె గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎం ఎస్పీ మండల ఇన్‌చార్జి కొడవటికంటి కిరణ్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 7న ప్రతి మాదిగ పల్లెలో జెండా ఆవిష్కరణలు జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి, అంతోని, రవి, దేవరాజు, బాబు, నాగయ్య, మండల ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30న నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు

వింజమూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఈనెల 30వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఆసక్తి కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. పదో తరగతి పైబడి చదివిన వారందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, 18 సంవత్సరాల నుంచి 39 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పుష్పరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఇంగ్లీష్ పీజీటీ, టీజీటీ, జీవశాస్త్రం పీజీటీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు జూలై 3వ తేదీలోపు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలన్నారు. 2025 డీఎస్సీ నియమ, నిబంధనల ప్రకారం, ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో కమిటీ ద్వారా డెమో తరగతుల ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు.

C.R.I.M.E N.E.W.S

రామతీర్థంలో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు, ఒకరికి తీవ్రం
- బ్రహ్మోత్సవాల్లో యువకుల మధ్య వివాదం



గాయపడిన శివరామ్

విడవలూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో గురువారం శ్రీకామాక్షీదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో యువకుల మధ్య జరిగిన చిన్నపాటి వివాదం చినికిచినికి గాలివానగా మారి, రెండు గ్రామాల మధ్య ఘర్షణకి దారి తీసింది. సేకరించిన సమాచారం మేర కు రామతీర్థం బ్రహ్మోత్సవాల్లో బా గంగా బుధవారం తీర్థవాది జరిగింది. ఈ క్రమంలో పాతూరుకి చెందిన యువకులకు, రామలింగాపురం యువకులకు మధ్య కొన్ని కారణాల వల్ల వివాదం నెలకొంది. ఈ వివాదం కాస్త పెద్దదిగా మారటంతో రామలింగాపురానికి చెందిన గ్రామకాపులు పాతూరుకి చెందిన కాపులతో వివాదానికి జరిగిన కారణాలపై మాట్లాడటం జరిగింది. కాపుల మధ్య సయోధ్య జరిగిన తరువాత రామలింగాపురానికి చెందిన కొందరు వ్యక్తులు పాతూరుకి వచ్చి ఇండ్లలో ఉన్న ముగ్గురు యువకులను దౌర్జన్యంగా తీసుకుని పోయారు. ఈ విషయం తెలుసుకున్న పాతూరు కాపులు, గ్రామస్థులు రామలింగాపురానికి వెళ్లి అక్కడ ఉన్న కాపులతో మీ గ్రామస్థులు చేయటం తప్పని వారించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన రామలింగాపురానికి చెందిన కొందరు పాతూరు గ్రామస్థులపై దాడి చేశారు. దీంతో పలువురికి స్వల్పగాయాలు కాగా నెల్లూరుకి చెందిన శివరామ్‌కి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతడిని నెల్లూరులోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నరేష్‌కుమార్ యాదవ్ కేసు విచారణ చేపట్టారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

కావలి రూరల్, జూన్26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాల వెనుకవైపు రైలు పట్టాలపై పడి ఉన్న పొన్నాడి శ్రావణ్‌కుమార్(24) మృతదేహాన్ని గురువారం లోకో పైలెట్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రమాదేవి సంఘటనా స్థలానికి చేరుకుని దిగువ మార్గంలోని రైలు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద లభించిన ఫోన్ ఆధారంగా కావలి మండలం ఒట్టూరుకి చెందిన యువకుడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడు తన ఆటోలో గ్రామం నుంచి కావలి వచ్చి, అక్కడ నుంచి జనసంచారం లేని ప్రాంతంలో ట్రాక్‌కు సమీపంలో ఆటో ఆపి చెప్పులు పక్కన వదిలిపెట్టి ఉన్నాడు. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు రైల్వే పోలీసులు నిర్ధారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే మృతుడి తండ్రి జాలయ్య ఇద్దరు కుమారులైలకు వివాహాలు చేసినా, అందరి దగ్గర అప్పులు చేసి, చీటీలు వేసి నగదు ఇవ్వకుండా తిరుగుతుంటాడని గ్రామస్థులు పేర్కొన్నారు. అయితే శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని తెలిపారు. ఈ మేరకు జీఆర్పీ ఎస్ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

నెల్లూరు (క్రైం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... ఈ నెల 24వ తేదీ తెల్లవారు జామున సుందరయ్య కాలనీ వద్ద జాతీయ రహదారి సమీపంలో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు ఆ ప్రాంత సచివాలయం వీఆర్వో ఉలవపాటి ప్రసాద్‌కు సమాచారమిచ్చారు. ఆయన అక్కడకు చేరుకుని సదరు వ్యక్తిని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. దీనిపై ప్రసాద్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వేదాయపాళెం పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతిచెందాడని, ఎడమకన్ను, ఎడమ చెంపవద్ద వాచిన గాయాలు, ముక్కు గుండా రక్తం కారి ఉందని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు



తూము వద్ద బోల్తా పడ్డ ఆటో, పక్కన కూలీలు

సైదాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని కలిచేడు వద్ద గురువారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... అనంతమడుగు గ్రామం నుంచి పొదలకూరు మండలం కొనగలూరు సమీపంలో ఉన్న మైనింగ్ పనులకు 8మంది కూలీలతో ఆటో వెళుతున్న సమయంలో ఆటో టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరు వ్యక్తులకు స్వల్పంగా గాయాలు కావడంతో పొదలకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వెళ్ళిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కాంతి కుమార్ తెలిపారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఉదయగిరి, జూన్ 26 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పారి శుధ్య కార్మికులు వేతనాలు చెల్లించాలని గురువారం వైద్యశాలకు వెళ్లే దారిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఫస్ట్ అబ్జెక్టు ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో వైద్యశాలలో ఎనిమిది మంది పారిశుధ్య కార్మికులు విధు లు నిర్వహిస్తున్నారన్నారు. గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని వాపోయారు. దూర ప్రాంతాల్లో ఉండేవారు విధులకు హాజరయ్యేందుకు బస్సు చార్జీల నగదుకు సైతం అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు నెల్లూరు కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్ అధికారిగా బదిలీ అయ్యారు. గురువారం ఆయనకు ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులు, గ్యారేజీ సిబ్బంది అభినందనలు తెలిపి వీడ్కోలు పలికారు.

మహమ్మద్ రఫీ మృతి టీడీపీకి తీరనిలోటు

దగదర్తి (బిట్రగుంట), జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడిగా పార్టీకోసం కష్టపడి పని చేసే మహమ్మద్ రఫీ (45) అకాల మృతి బాధాకరమని ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. దగదర్తి మండలం యలమంచిపాడుకి చెందిన ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడు రఫీ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే గురువారం దర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఆయన తల్లి, కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పమిడి రవికుమార్ చౌదరి, కే.మధుబాబునాయుడు, జలదంకి శ్రీహరి, హనుమంతరావు, హరిరెడ్డి, పులిశీనయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

మృతుల కుటుంబాలకు బీద పరామర్శ


టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బీద

కావలి,జూన్26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు మృతుల కుటుంబాలను గురువారం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పరామర్శించారు. టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఇస్లాంపేటలో ఉన్న ఆయన నివాసానికి బీద వెళ్లి కుటుంబ సభ్యులను బీద పరామర్శించారు. అలాగే సీనియర్ జర్నలిస్ట్ ఓలేటి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, కొత్తబజారులోని ఆయన నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే నాగేశ్వరరావు ఉత్తరక్రియలు గురువారం స్థానిక నారాయణ కల్యాణ మండపంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీజేపీ, జనసేన. కమ్యూనిస్టు పార్టీల నేతలు పాలొన్నారు.

మరోసారి టీడీపీ మండల అధ్యక్షుడిగా మాదాల


టీడీపీ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన లక్ష్మీనరసింహంను సన్మానిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా మాదాల లక్ష్మీనరసింహం (చిన్న) రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను గురువారం పలువురు టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. అలాగా మండల టీడీపీ ప్రధాన కార్యదర్శిగా గురిజాల బెంజిమెన్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మాలకొండ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, సీనియర్ న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, నాయకులు ప్రగడ మోహన్‌కుమార్, చెరువుపల్లి సాంబయ్య, ప్రగడ చిననారాయణ, దేగా వెంకటేశ్వర్లు, నల్లమోతు అంకయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న టీడీపీ నేత వలేటి మధుసూదన్‌రావు

వలేటివారిపాలెం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులు, సన్నజీవాల పెంపకందారులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ ఎంతోటి చెన్నకేశవులు తెలిపారు. వలేటివారిపాలెంలో టీడీపీ నాయకులతో కలిసి గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, వలేటి మధుసూదన్‌రావు, వలేటి నరసింహం, కాకుమాను ఆంజనేయులు, కాకుమాను మాల్యాద్రి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : బొల్లినేని


యశోదమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లినేని

కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లవేళలా టీడీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. గురువారం కలిగిరిలోని తన కార్యాలయంలో పలువురు నేతలతో ముచ్చటించారు. కలిగిరి గుండా నాలుగులైన్ల రహదారి నిర్మాణం, మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని స్థానికులు ఆయన్ను కోరారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు ఉసా మాల్యాద్రి సతీమణి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే టీడీపీ మండలాధ్యక్షుడు బిజ్జం వెంకటకృష్ణారెడ్డి అత్త మునగాల యశోదమ్మ ఉత్తరక్రియల్లో బొల్లినేని పాల్గొన్నారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, బీవీ రామారావు, చీమల తాతయ్య, తదితరులు పాల్గొన్నారు.

● బొల్లినేని విరాళం

ఈనెల 29 నుంచి జరగనున్న కలిగిరమ్మ ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రూ.20వేల విరాళాన్ని గురువారం నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లినేని మాట్లాడుతూ కలిగిరి పట్టణం, జిర్రావారిపాలెం, పాపనముసిలిపాలెం గ్రామల ప్రజలు కలిసికట్టుగా చేసుకునే ఈ ఉత్సవాలు గ్రామాలమధ్య స్నేహభావాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

పక్కాగృహాల నిర్మాణం వేగవంతం చేయాలి


పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

దగదర్తి (బిట్రగుంట), జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల పరిధిలోని జగనన్న కాలనీలు, పక్కాగృహ నిర్మాణాలను జిల్లా హౌసింగ్ పీడీ వేణుగోపాల్ గురువారం సందర్శించారు. విశ్వనాథరావుపేట పంచాయతీ పరిధిలో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారుడికి సకాలంలో బిల్లులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఆర్థిక అదనపుభారం కలుగ కుండా ఇళ్ళనిర్మాణం పూర్తి అయేలా చూడాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం 1లో లక్షా 40 వేల ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. అందులో 30 వేల ఇళ్లు పూర్తి కాగా 22 వేలు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ హేమంత్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, స్థానికులు ఉన్నారు.

నాలుగు మండలాలకు టీడీపీ నూతన అధ్యక్షులు

● కందుకూరు పట్టణం, లింగసముద్రం కమిటీల ఎంపిక వాయిదా

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా కందుకూరు రూరల్, వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలకు నూతన అధ్యక్షుల ఎంపిక గురువారం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కందుకూరు రూరల్ మండలానికి నార్నె రోశయ్య స్థానంలో దొండపాడుకి చెందిన బుస్సారెడ్డి కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. వలేటివారిపాలెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాలకు పాత అధ్యక్షులైన మాదాల లక్ష్మీనరసింహ్మం, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావులను తిరిగి ఎన్నుకున్నారు. కందుకూరు పట్టణ అధ్యక్షుడిగా కొనసాగేందుకు నామినేటెడ్ పదవి ఆశిస్తున్న దామా మల్లేశ్వరరావు విముఖత చూపటంతో వాయిదా వేశారు. లింగసముద్రం అధ్యక్షుడిగా ఉన్న వేముల గోపాల్ స్థానంలో ఎస్సీకి అవకాశం కల్పించాలని ఆ మండల అధ్యక్షుడి ఎంపిక కూడా వాయిదావేశారు. ఎంపికల కార్యక్రమానికి కుసుమకుమారి, రాచమల్ల శ్రీనివాసరెడ్డి, చుంచు కొండయ్యలు పరిశీలకులుగా హాజరుకాగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులలో ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతోందన్నారు.

● ఎంపికతీరుపై అసంతృప్తి

పార్టీ మండల కమిటీల ఎంపిక తీరుపై గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో మండల కమిటీల ఎంపిక మండలకేంద్రంలో అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తల సమక్షంలో వారి అభీష్టం మేరకు జరిగేదని అందుకు విరుద్ధంగా ఈవిడత ఎమ్మెల్యే కార్యాలయంలో అతికొద్దిమందికి మాత్రమే సమాచారం ఇచ్చి ఏకపక్షంగా అధ్యక్షులను ప్రకటించటం జరిగిందన్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు

● భారమైన నిర్వహణ ● చెత్త సేకరణ మరచిన పంచాయతీ పాలకులు
● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా కేంద్రాలు ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం


భీమవరప్పాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

కొండాపురం, జూన్26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు గత టీడీపీ ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహకారంతో ప్రతి పంచాయతీలోనూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం చేసింది. పారిశుధ్య నిర్వహణలో చెత్తనుంచి సంపద తయారీకేంద్రాల పాత్ర ఎంతో కీలకం. గతంలో వీటి నిర్వహణ పూర్తిస్థాయిలో జరుగుతూ గ్రామాలు శుభ్రంగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణను గాలి కొదిలేశారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల లక్ష్యం నెరవేకుండాపోయింది. మండలంలో 19 పంచాయతీలుండగా 17 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. తూర్పుఎర్రబల్లి, నేకునాంపేట పంచాయతీలలో స్థానిక సమస్యలతో నిర్మాణం జరగలేదు. ఈకేంద్రాలకు పారిశుధ్య కార్మికులద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించి చేర్చడం జరుగుతుంది. కేంద్రానికి చేరిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా కుళ్లబెడతారు. ఇందులోని ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను యంత్రాల సాయంతో పిండిచేస్తారు. ఈ పిండిని సీసీ రోడ్లు, తారు రోడ్ల నిర్మాణాల్లో వినియోగిస్తారు. చెత్తను సేంద్రియ ఎరువుగా తయారుచేసి ఆయా గ్రామాల రైతులకు కేజీల చొప్పున విక్రయిస్తారు. చెత్తను సేంద్రియ ఎరు వుగా మార్చేందుకు అ య్యేందుకు ఖర్చు అధి కంగా అవుతుందని పం చాయతీ పాలకులు ఆరోపిస్తున్నారు.

● అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వాలు ఏర్పాటుచేసిన లక్ష్యం పూర్తిగా నెరవేరలేదని పలువురు విమర్శిస్తున్నారు. వీటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగామారాయి. గ్రామాలలో చెత్తను సేకరించడం జరగకపోవడంతో ఎక్కడచూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పాలకులు స్పందించి చెత్తనుంచి సంపద తయారీకేంద్రాలను పూర్తిస్థాయిలో వాడుకలోకి తీసుకురావాలి.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పంచాయతీలదే. ప్రభుత్వ నిబంధన మేరకు పలు పంచాయతీలలో పాక్షికంగా చెత్త సేకరణ జరుగుతున్నది. అన్నిపంచాయతీలోనూ చెత్త సేకరణ జరిగేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

- ఆదినారాయణరావు, ఎంపీడీవో

మాదక ద్రవ్యాల రహిత కావలిగా తీర్చిదిద్దుదాం : ఎమ్మెల్యే దగుమాటి




కావలి : మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, అధికారులు, విద్యార్థులు, కందుకూరు : నిషా ముక్తభారత్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, పోలీసు అధికారులు, కలిగిరి : పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మానవహారం

కావలి, జూన్26(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో గంజాయి వ్యాపారాన్ని పెంచి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన అనుచరులు సొమ్ముచేసుకున్నారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గంజాయిని నిర్మూలించిందన్నారు. కావలిని మాదకద్రవ్యాల రహితంగా చేసేందుకు యువత నడుము బిగించాలని ఆయన తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ట్రిడ్జిసెంటర్ నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వరకు అధికారులు, విద్యార్థులు అవగాహనర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్ వద్ద ప్రతిజ్ఞ చేయించారు.ర్యాలీలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ, డీఎస్పీ పీ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలిలో మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపి మాదకద్రవ్యాల రహిత కావలిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు.

● కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కలిగిరి సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలో విద్యార్థులతో కలిసి పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. కార్యక్రమంలో కలిగిరి, వింజమూరు, జలదంకి ఎస్ఐలు ఉమాశంకర్, వీరప్రతాప్, లతీఫున్నీసా, ఎక్సైజ్ సీఐ మహమ్మద్ అబ్దుల్ ఖలీల్, పోలీసు సిబ్బంది, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఉలవపాడు : ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, మెరైన్ పోలీసులు

● ఉలవపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రామాయపట్నం మెరైన్ పోలీసులు విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. రామాయపట్నం, పెద్దపట్టుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగం వలన కలిగే దుష్పరిణామాల గురించి మెరైన్ ఎస్ఐలు ఎస్కే మస్తాన్ షరీఫ్, ఈశ్వరయ్య వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామాయపట్నం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుధాకర్, పీడీ జీవన్ కుమార్, పెద్దపట్టపుపాలెం హెచ్ఎం ఎస్కే సలీంబాషా, పంచాయతీ సెక్రటరీ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలల్లో గురువారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన నషా విముక్తి అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే.నరేష్‌రాజా, పీడీ కే. కరుణరత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ నాగూర్‌వలీ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కాగా గురువారం సాయంత్రం పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ పోలీసుస్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది, విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యంలు ముఖ్య అతిథులుగా ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి పామూరురోడ్డులోని వెంగమాంబ ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతను మాదకద్రవ్యాల వ్యసనపు ముప్పు నుంచి కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తున్నదని ఆయన వివరించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న బీద గిరిధర్

అల్లూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకున్న పేదలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు సీఎం సహాయ నిధి దోహదపడుతుందని పెన్నార్ డెల్టా కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. గురువారం ఐదుగురు లబ్ధిదారులకు రూ3,78,186 విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీహరి, బుచ్చింగారి బాబు, కీర్తి బాబూరావు, మక్కి గోపాల్‌రావు, పిట్టి సుబ్రహ్మణ్యం, కొండూరు సాయి కిరణ్, ఆవల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

లేఅవుట్లు, భవనాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు(సిటీ), జూన్26,(ఆంధ్రజ్యోతి) : నగరంలో భవన నిర్మాణాలకు, కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు కార్పొరేషన్ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ తెలిపారు. గురువారం మూలాపేట, ఖుద్దూస్‌నగర్, సవరాలవీధి, మినీ బైపాస్‌తోపాటు పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాలు, నిబంధనలు అతిక్రమించిన కట్టడాలను గుర్తించాలని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

వాకర్స్‌కు బల్లల ఏర్పాటు


బల్లలు ఏర్పాటు చేయిస్తున్న వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లికి చెందిన టీడీపీ నేత ఇందుపూరు ధనుంజయరెడ్డి జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు రామ్మోహన్‌రెడ్డి వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు రెండు సిమెంట్ బల్లలను గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ.బర్నాడ్, మాజీ గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్ మాట్లాడుతూ అందరి కోసం అన్నదే వాకర్స్ నినాదమన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మన్నెం శ్రీనివాసులు, సత్యనారాణాచార్యులు, స్పర్జన్‌రాజ్, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

కావలి,జూన్26(ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ స్థాపించి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు 45 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్‌మేనేజరు సీహెచ్ లోకనాథం, స్టాఫ్ యూనియన్ కార్యదర్శి కే. శ్రీనివాసులు రెడ్డి,కోశాధికారి సీహెచ్ ప్రసన్న, సభ్యులు జీవన్, సెక్యూరిటీ అధికారి రహీమ్‌బాష, కావలి రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ కే. హరినారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలుగు వ్యావహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆగస్టు 29 నుంచి నెల్లూరు టౌనుహాలులో తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా రచయితలు, రచయిత సంఘాల కూటమి సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించిన గోడపత్రికలను ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. అధ్యయన కేంద్రం సంచాలకుడు మాడభూషి సంపత్ కుమార్, ప్రముఖ రచయితలు డాక్టర్ పెరుగు రామకృష్ణ, టేకుమళ్ల వెంకట సుబ్బయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు జిల్లేళ్ల బాలాజీ, గంగిశెట్టి శివకుమార్, సేవ అధ్యక్షుడు కంచర్ల సుబ్బానాయుడు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరాలో అంతరాయం లేదు

● విద్యుత్ డీఈఈ రవికుమార్

కావలిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి) వేసవిలో కరెంట్ కోతలు లేకుండా సజావుగా విద్యుత్ సరఫరా జరిగింది. ట్రంకురోడ్డు విస్తరణ పనుల వల్ల పాత లైన్లు తొలగించడం, నూతన లైన్లు అమర్చడం తదితర పనుల వల్ల ఇటీవల కొన్ని రోజులు రోడ్డుకిరువైపుల ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని విద్యుత్ డీఈఈ రవికుమార్ తెలిపారు.

ఈ ముఖాముఖి

? : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారు.

! : అవసరమైన చోట్ల కాలం చెల్లిన పాత లైన్ల స్థానంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయడం, లోడ్ కనుగుణంగా అవసరమైన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయడం చేశాం. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో సమస్య అధిగమించాం

? : లోవోల్టేజ్ సమస్య ఎలా ఉంది.

! : గతంతో పోలిస్తే లోవోల్టేజ్ సమస్య లేదనే చెప్పాలి అవసరమైన చోట్ల నూతన ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా సమస్య, లోవోల్టేజ్ సమస్య పరిష్కారమైనట్లే.

? : పట్టణంలో ఎన్ని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

! : ఇటీవల 20నూతన ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేశాం. మరో 10 ట్రాన్స్‌పార్మర్లు బిగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో 10 ట్రాన్స్‌పార్మర్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

145 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 566పొగాకు బే ళ్లు అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 421బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-122, ఆర్ఆర్-12, సీఆర్-4, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 145బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.221.94గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులుగా రామకృష్ణ

బిట్రగుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులుగా ఎస్.రామకృష్ణ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ ప్రవీణ్‌కుమార్ విజయవాడకు బదిలీ కాగా, ఆ స్థానంలో వాకాడు పీహెసీలో పనిచేస్తున్న డాక్టర్ రామకృష్ణ ఇక్కడికి వచ్చారు. తోటి వైద్యులు, సిబ్బంది పరిచయ అనంతరం ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

బెల్టు షాపులను నిర్మూలించాలి

కందుకూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మద్యం బెల్ట్‌షాపులతో నిరుపేద కూలీలు, గ్రామీణ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటి నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మద్యం బెల్ట్ షాపులది ప్రధాన సమస్యగా మారిందన్నారు. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నిర్వాహకులే బెల్ట్‌షాపులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. వారు విచ్చలవిడిగా అధికరేట్లకు విక్రయిస్తున్నారని, కూలీపనులకు వెళ్లే ప్రజలు సాయంత్రానికి అందుబాటులో మద్యం ఉంటుండటంతో ధర ఎంతనేది ఆలోచించకుండా ప్రతిరోజు మద్యం సేవిస్తూ జేబుకు చిల్లు పెట్టుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం షాపులు, బెల్ట్‌షాపుల వ్యవహారం ఓ మాఫియాగా మారుతున్నందున ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి బెల్ట్‌షాపులను నిర్మూలించాలని ఆయన డిమాండ్ చేశారు.



అంధుడినని విధుల్లోకి చేర్చుకోకుండా అవమానించారు!

- తహసీల్దారు ఛాంబరులోకి అనుమతించలేదు
- టీటీడీ సభ్యుడు భాను ఎదుట వాపోయిన డీటీ నాగరాజు

తిరుపతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంధుడినని తనను విధుల్లోకి చేర్చుకోకుండా బీఎన్ కండ్రిగ తహసీల్దారు అవమానించారని, కనీసం తనను ఛాంబరులోకి కూడా అనుమతించలేదంటూ డీటీ బి.నాగరాజు వాపోయారు. అంధుడినైనా రెవెన్యూ శాఖలో వివిధ పోస్టుల్లో పనిచేసిన తాను ఇలా ఏనాడూ వివక్షను, అవమానాన్ని ఎదుర్కోలేదంటూ కంటతడి పెట్టారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం ఆయన టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని కలిసి తనకెదురైన చేదు అనుభవాన్ని వివరించారు. పుట్టుకతో అంధుడినైన తనకు రెవెన్యూ శాఖలో ఉద్యోగం రావడంతో శక్తిమేరకు విధులు నిర్వర్తిస్తున్నానని చెప్పారు. డీటీగా తొట్టంబేడు మండలంలో పనిచేసిన తనకు తాజా బదిలీల్లో బీఎన్ కండ్రిగకు బదిలీ అయిందన్నారు. గత సోమవారం విధుల్లో చేరేందుకు బీఎన్ కండ్రిగ వెళ్లగా తహసీల్దారు కార్యాలయ గదిలోకి కూడా అనుమతించలేదని, విధుల్లోకి చేర్చుకునేది లేదని చెప్పి పంపించేశారన్నారు. అంధుడినని, విధులకు సంబంధించిన పనులు చేయలేనన్న ఉద్దేశంతోనే అవమానించారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి భానుప్రకాష్‌రెడ్డి తీసుకెళ్లారు. దీనిపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో మాట్లాడుతున్న డీటీ నాగరాజు

అవమానించలేదు.. ఆలస్యం జరిగిందంతే

ఈ విషయమై బీఎన్ కండ్రిగ తహసీల్దారు శ్రీదేవిని వివరణ కోరగా.. తాను డిప్యూటీ తహసీల్దారు నాగరాజును అవమానించలేదని, విధుల్లోకి చేర్చుకోవడంలో ఆలస్యం జరిగిందని సమాధానమిచ్చారు. గత సోమవారం విధుల్లోకి చేరేందుకు ఆయన తమ కార్యాలయానికి రాగా ఛాంబరులోకి పిలిచి కూర్చోబెట్టి మాట్లాడానని చెప్పారు. అంధుడైనందున ప్రజల అర్జీలు చదవలేరని, పనులు ఆలస్యమవుతాయని కొందరు అధికార పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారన్నారు. దీనిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరొకరిని డీటీగా కేటాయించాలని కోరే ప్రయత్నంలో డీటీ నాగరాజు విధుల్లోకి చేరడం ఆలస్యమైందన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఫోన్ చేసి డీటీ నాగరాజును విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు డ్యూటీలో జాయిన్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అవమానించారన్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

తిరుమలలో శ్రీదేవి

'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో చాలా మార్పులు వచ్చాయని, ప్రసాదాలు, దర్శన విధానాలు బాగున్నాయన్నారు. ఆలయం ముందు శ్రీదేవితో పలువురు సినీ అభిమానులు సెల్ఫీలు తీసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరు

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకుగాను జిల్లాలో మూడు కేంద్రాల్లో ఆరో రోజైన గురువారం నిర్వహించిన వెబ్ కౌన్సెలింగ్‌కు 264 మంది హాజరయ్యారని జిల్లా కోఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ వై. ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. 86,001 నుంచి 1,04,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరిగింది. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కళాశాలలో జరిగిన కౌన్సెలింగ్‌కు 201 మంది హాజరయ్యారు. సత్యవేడులో 10 మంది, గూడూరులో 53 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరై తమ సర్టిఫికెట్లను ధ్రువీకరించుకున్నారు. శుక్రవారం 1,04,001 నుంచి 1,20,000 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ జరగనుంది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

'పీజీఆర్ఎస్'పై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- ప్రభుత్వ ఆస్తులు, శాంతిభద్రతల పరిరక్షణలో మెజిస్టీరియల్ అధికారాలు వినియోగించాలి
- సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్లను రాష్ట్ర భూపరిపాలన చీఫ్ కమిషనర్ జయలక్ష్మి హెచ్చరించారు. 22ఏ, రీసర్వే హౌసింగ్, జీవో నెంబరు 30 తదితర రెవెన్యూ సంబంధిత అంశాలపై జిల్లా రెవెన్యూ అధికారులతో గురువారం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి సుదీర్ఘంగా సమీక్షించారు. మండలస్థాయిలో పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణకు నోడల్ అధికారులను నియమించాలన్నారు. వచ్చిన అర్జీలపై వారంలోపు నివేదికలు ఇవ్వాలన్నారు. పీజీఆర్ఎస్‌పై ప్రతి తహసీల్దారు అవగాహన పెంచుకోవాలన్నారు. మ్యుటేషన్లు, కుల ధ్రువీకరణ, చట్టపరమైన అంశాల్లో తప్పిదాలకు తావివ్వరాదన్నారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి ఏ ఎంట్రీ అయినా నమోదు చేసేటప్పుడు క్షేత్రస్థాయిలో వీఆర్వో అప్‌లోడ్ చేసే డాక్యుమెంట్లను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. చట్టంలో లేనివి చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని స్పష్టంచేశారు. హౌసింగ్ ఫర్ఆల్ అంశంలో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని తొలిదశలో కేటగిరి1లో వచ్చే దరఖాస్తుల్లో ప్రభుత్వ భూమి రెడీగా ఉన్నవిపేర్కొనాలన్నారు. దరఖాస్తులు ఎక్కువ వచ్చిన గ్రామాలకు వెళ్లి సబ్ కలెక్టర్, ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. ఆ తరువాత ఇంటి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆగస్టు 15లోపు పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులైజేషన్‌కు సంబంధించి ప్రతి తహసీల్దారు మంగళవారం నుంచి శుక్రవారం వరకు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలన్నారు. భూ ఆక్రమణలు, రెండు వర్గాల మధ్య తగాదాలు తదితర అంశాల్లో తహసీల్దార్లు తమకున్న అధికారులను వినియోగించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు, శాంతి భద్రతల పరిరక్షణలో మెజిస్టీరియల్ అధికారాలు ఉపయోగించాలన్నారు. ప్రజలతో మర్యాదగా నడుచుకున్నప్పుడే రెవెన్యూ శాఖకు మంచిపేరు వస్తుందన్నారు. ఈ సమీక్షల్లో డీఆర్వో నరసింహులు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, సుధారాణి, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ జయలక్ష్మి

రెండు సెంట్ల ఇంటి స్థలాలపై కసరత్తు



→ జగన్న కాలనీని సందర్శిస్తున్న సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి

ఏర్పేడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను గురువారం సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ జయలక్ష్మి సందర్శించారు. గత ప్రభుత్వంలో ఇక్కడ సుమారు 250 ఎకరాలు ఇంటి స్థలాలకు కేటాయించారు. తిరుపతి అర్బన్‌కు చెందిన ఇళ్లు లేని పేదలకు సెంటు వంతున అందజేశారు. 210 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన 40 ఎకరాల్లో రెండు సెంట్ల వంతున ఇచ్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. జేసీ శుభం బన్సల్, తహసీల్దారు భార్గవి, తిరుపతి అర్బన్ తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి కొట్టేశారు

రూ.2వేల నోట్ల మార్పిడి ముసుగులో భారీ మోసం

- కేసును ఛేదించి.. నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ.73.20 లక్షల నగదు, వాహనాల సీజ్



తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): రూ.రెండు వేల నోట్లు చెలామణిలో లేవు. తగు ఆధారాలు చూపి రిజర్వు బ్యాంకులో మార్చుకోవచ్చు.ఈ వెసులుబాటునే కొందరు తమ మోసానికి అస్త్రంగా వాడుకున్నారు. తమ వద్ద ఎక్కువ మొత్తంలో రూ.రెండు వేల నోట్లున్నాయని నమ్మించారు. తమకు రూ.500 నోట్లతో రూ.కోటి ఇస్తే..రూ.రెండు వేల నోట్లు రూ.2.5 కోట్లకు ఇస్తామని మైండ్‌గేమ్ ఆడారు. అలా సూళ్లూరుపేటలో ఒకరిని నమ్మించి.. అతడికి రూ.2 వేల నోట్లు ఇవ్వకనే రూ.కోటి కొట్టేశారు. ఈ కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలను ఎస్పీ హర్షవర్ధనరాజు గురువారం తిరుపతిలో మీడియాకు వెల్లడించారు.

శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గకు చెందిన అంబటి సంతోష్ అలియాస్ చిన్నస్వామి, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన బర్రి రవితేజ, తిరుపతికి చెందిన కె.హేమకర్‌రావు, విశాఖపట్నంలోని కంచర్లపాలెంకు చెందిన మామిడి ఉమామహేష్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు పలువురిని కలుస్తూ తమ వద్దనున్న రూ.రెండు వేల నోట్ల కట్టను చూపుతారు. రూ.లక్షకు రూ.500 నోట్లు ఇస్తే రూ.రెండు లక్షలకు సంబంధించి రెండువేల నోట్లు ఇస్తామని, మీకు రిజర్వు బ్యాంకులో ఎవరైనా తెలిసుంటే మార్చుకోవచ్చని చెబుతారు. ఎవరైనా వీరి మాయలో పడితే డబ్బు తీసుకుని, రూ.రెండు వేల నోట్లు ఇవ్వకుండా పారిపోతారు. ఇలా గత నెలలో సూళ్లూరుపేటలో పలువురిని కలిసి 'డీల్' మాట్లాడారు. ఈ క్రమంలో మినీ ఏటీఎం నిర్వాహకుడు జగదీష్ వీరి వలలో పడ్డారు. రూ.కోటి ఇస్తే తాము రూ.రెండున్నర కోట్లకు రూ.రెండు వేల నోట్లు ఇస్తామని అతడిని వీరు నమ్మించారు. దీంతో అతడు రూ.కోటి సిద్ధం చేసుకున్నారు. గతనెల 7వ తేది ఈ నిందితులు వాహనాల్లో సూళ్లూరుపేటకు చేరుకుని సమీపంలోని హైవే వద్దకు రమ్మని జగదీష్‌కు చెప్పారు. అతడు రూ.కోటి బ్యాగుతో ఇద్దరు స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లారు. జగదీష్‌తో ఉన్న ఇద్దరిని దగ్గరలో వున్న తమ గదికి వెళితే బాస్ (అంబటి సంతోష్) రూ.రెండువేల నోట్లు రూ.2.50 కోట్లు ఇస్తారని చెప్పి పంపారు. అనంతరం జగదీష్ వద్ద ఉన్న రూ.కోటి బ్యాగును అంబటి సంతోష్ పీఏనని చెప్పిన వ్యక్తి తీసుకుని కారులో పారిపోతుండగా, జగదీష్ అప్రమత్తమై ఆ కారు డోరును పట్టుకున్నారు. కారులోని నిందితులు అతడిని కిందకు నెట్టేసి పరారయ్యారు. మిగిలిన వారూ మరో రెండు వాహనాల్లో పలాయనం చిత్తగించారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు డీఎస్పీ చెంచుబాబుకు విషయం తెలిపి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ కేసు నమోదు చేశారు. నిందితుల ఆచూకీ కోసం పలు కోణాల్లో దర్యాప్తు చేశారు.

వేలిముద్రలే పట్టిచ్చాయా?

ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో డీఎస్పీ చెంచుబాబు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, డీవీ సత్రం ఎస్ఐ అజయ్‌బాబు, తడ ఎస్ఐ కొండమనాయుడు, ఏఎస్ఐలు, పోలీసులు బృందాలుగా విడిపోయారు. నిందితుల కదలికలు, గతంలో వారు ఎక్కడైనా నేరాలకు పాల్పడ్డారా? ఇలాంటి నేరాలు ఎక్కడ జరిగాయి? అనే కోణాల్లో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేశారు. మొదట ఈ కేసులో కీలక నిందితుడు అంబటి సంతోష్ వేలిముద్రలు పరిశీలించారు. ఇవి సరిపోవడంతో అతడి కోసం గాలించారు. వారి కదలికలపై దృష్టి సారించిన పోలీసులు అంబటి సంతోష్, బర్రి రవితేజ, ఉమామహేష్‌ను చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద, కె.హేమకర్‌రావును తిరుపతిలో అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.73.20 లక్షల నగదు, రెండు వాహనాలు, ఆరు రూ.2000 నోట్ల డమ్మీ కట్టలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో దొంతిరెడ్డి హరిబాబు రెడ్డి పరారీలో ఉన్నాడు. ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందచేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, డీఎస్పీ పాల్గొన్నారు.

అందరూ పాత నేరస్థులే

నాయుడుపేట పోలీసులు అరెస్టు చేసి నలుగురు నిందితులూ పాత నేరస్థులుగా గుర్తించారు. వీరిలో అంబటి సంతోష్‌పై కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో 32వ రౌడీషీటర్‌గా, అలిపిరి, అనకాపల్లి, మాల్కాపురం, కాశీబుగ్గ స్టేషన్‌లలో ఐదు కేసులు నమోదై ఉన్నాయి. తిరుపతి మారుతీనగర్‌కు చెందిన హిమకర్‌పై కాణిపాకం స్టేషన్‌లోలో చీటింగ్ కేసు, బర్రి రవితేజ, మామిడి ఉమామహేష్‌పై దాదాపు ఆరు కేసులున్నట్లు తెలిసింది.

వార్డు కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్

నేటినుంచి చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహణ



కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం విడుదల చేశారు. ఈ ప్రక్రియను ఈనెల 30వ తేదీలోపు పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని తిరుపతి, చిత్తూరు నగరపాలక సంస్థలతోపాటు మదనపల్లె, శ్రీకాళహస్తి, పలమనేరు, పుంగనూరు, నగరి, పుత్తూరు, కుప్పం పురపాలక సంఘాల పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీలకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. వార్డు కార్యదర్శులకు శుక్ర, శని వారాల్లో నాగయ్య కళాక్షేత్రంలో బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు అమినిటీ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. శనివారం ఉదయం 10.30గంటల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.



తిరుపతిలో నిర్వహిస్తున్న ర్యాలీ

డ్రగ్స్‌పై మౌనం వద్దు

మీకు తెలిసిన వాళ్లో.. స్నేహితులో డ్రగ్స్ తీసుకుంటున్నారా? డ్రగ్స్‌కు అలవాటు పడ్డ వాళ్లు.. ఇతర నేరాలకూ పాల్పడతారనేది గుర్తించండి. అలాంటి వారిని సన్మార్గంలో పెట్టాలంటే మీరు మౌనం వీడాలి. పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అలా ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

6





ఆలయం ముందు రఘు - బండ్ల గణేష్

ప్రసాదాలు బావున్నాయి

● ప్లీజ్.. ఇలానే కంటిన్యూ చేయండన్న నటుడు రఘు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ అందిస్తున్న సౌకర్యాలు బావున్నాయని సినీనటుడు రఘు సంతృప్తి వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో గతానికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. అనేక చోట్ల కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి సేవలు అందించడం బావుందన్నారు. 'ప్రసాదాల రుచి బావుంది.. ప్లీజ్ .. ఇలానే కంటిన్యూ చేయండి' అని అన్నారు. అలాగే 'కోర్టు' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రీదేవి, నిర్మాత బండ్ల గణేష్ కూడా గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఇంకా ఉత్తరాఖండ్ మాజీ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మాధవి రెడ్డి, పులివర్తి నాని కూడా గురువారం స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

హైదరాబాదు- కన్యాకుమారి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూన్26(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాదు-కన్యాకుమారి మధ్య తిరువణ్ణామలై మీదుగా 8 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరువణ్ణామలై పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని తెలుసుకొని వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జూలై 2 నుంచి 25వ తేది వరకు రాక పోకలు సాగిస్తాయన్నారు. హైదరాబాదులో ఈ ప్రత్యేక రైలు(07230) జూలై 2న (బుధవారం) సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరి సికింద్రాబాదు, నల్లగొండ, నడికుడి, గుంటూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, చిత్తూరు, కాట్పాడి, తిరువణ్ణామలై మీదుగా కన్యాకుమారికి 3వ తేది అర్ధరాత్రి దాటాక 2.30 గంటలకు చేరుకొంటుందని తెలిపారు. 4వ తేది (శుక్రవారం) ఉదయం 5.15 గంటలకు ఈ ప్రత్యేక రైలు(07229) బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ 5వ తేది మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాదు చేరుకొంటుందన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 30 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,001

తలనీలాలు సమర్పించినవారు: 23,765



ఎగసిపడే అలలు.. లయబద్ధంగా వినిపించే తరంగాల హోరు.. విశాలంగా పరచుకున్న ఇసుక తిన్నెలు.. నీలాకాశ అంచుల్ని ముద్దాడుతున్నట్లు కనిపించే సముద్రం సందర్శకులను కట్టిపడేస్తాయి. మనసు దోచుకునే ఈ ప్రకృతి రమణీయ తీరాలు చేరువలోనే ఉన్నాయి. అయితే ఆలనాపాలనా లేక ఆదరణకు దూరమవుతున్నాయి. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ప్రముఖ బీచ్‌ల సరసన చేరే సత్తా ఈ సుమనోహర తీరాలకుంది.

- గూడూరు, (ఆంధ్రజ్యోతి)

దృష్టి సారిస్తే ఈ తీరాలు మణిహారాలు

ఈ బీచ్‌లకు ఎలా వెళ్లాలంటే....

గూడూరు నుంచి గుమ్మళ్లదిబ్బకు 38 కిలోమీటర్లు దూరం. ఆర్టీసీబస్సు సౌకర్యం ఉంది. గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో బీచ్ ఉంటుంది. నెల్లూరు నుంచి ముత్తుకూరు మీదుగా పోర్టురోడ్డు గుండా సుమారు 48 కిలోమీటర్లు ఉంటుంది. కోట నుంచి సుమారు 30 కిలోమీటర్లలోపే దూరం ఉంటుంది. నెల్లూరు, గూడూరు, కోట ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యముంది. తీగపాళెం బీచ్‌కు వెళ్లాలంటే లింగవరం నుంచి లేదా, గుమ్మళదిబ్బ నుంచి వెళ్లాలి. అయితే రెండు కిలోమీటర్ల మేర గ్రావెల్‌రోడ్డులో వెళ్లాలి. తారు రోడ్డు సౌకర్యం లేక చాలామంది వెనుకడుగేస్తున్నారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధికి ఊతం

ఇక్కడి బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే స్థానిక మత్స్యకారులకు జీవనోపాధి మెరుగుపడుతుంది. వివిధ రూపాల్లో ఇతరులకూ ఉపాధి కలుగుతుంది. రాష్ట్రానికి కొంత ఆదాయమూ సమకూరుతుంది. క్రిస్‌సిటీ నేపథ్యంలో ఇక్కడి బీచ్‌లపై పర్యాటకశాఖ ఫోకస్ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.



తీగపాళెం తీరంలో సందర్శకుల సందడి



తీగపాళెం బీచ్‌కు ఈ ఇరుకుదారే ఆధారం



తీగపాళెంలో పర్యాటకాభివృద్ధిపై పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

● సహజ అందాలకు నెలవు గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లు



గుమ్మళ్లదిబ్బ తీరంలో సోయగాలు

సహజ సౌందర్యానికి కేరాఫ్‌గా నిలుస్తాయి చిల్లకూరు మండలం గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం గ్రామాల బీచ్‌లు. ఫోకస్ లేక వీటి ఉనికి అంతంతమాత్రమైంది. సాధారణంగా సాగర తీరం అభివృద్ధి చేస్తే పర్యాటకంగానే కాదు.. ఎన్నో అంశాలనూ ఇది ప్రభావితం చేస్తుంది. గుజరాత్ తీరం ఆధారంగానే అభివృద్ధి సాధించింది. పాండిచ్చేరి, చెన్నై, గోవా, కేరళలోనూ బీచ్‌లను పర్యాటకంగా తీర్చిదిద్దుతున్నారు. గుమ్మళ్లదిబ్బ, తీగపాళెం బీచ్‌లను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేస్తే సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి.



గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతంలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణ కేంద్రం

పరిశీలనే తప్ప పురోగతి ఏది?

గుమ్మళ్లదిబ్బ బీచ్‌లో ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణా కేంద్రముంది. కృష్ణపట్నం పోర్టు నుంచి ఇక్కడికి ఆరు కిలోమీటర్ల దూరం. తీగపాళెం బీచ్ 9 కిలోమీటర్ల దూరం. సమీపాన తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. తూర్పుకనుపూరు నుంచి ఈ బీచ్‌లకు 15 కిలోమీటర్ల దూరమే. పోర్టు సందర్శకులు, అమ్మవారి భక్తులకు మానసిక ఉల్లాసాన్ని పంచేందుకు ఈ రెండు బీచ్‌లు దోహదపడతాయి. వేసవి సెలవుల్లో కుటుంబసమేతంగా వచ్చి సేద తీరవచ్చు. ప్రీవెడ్డింగ్ షూటింగ్‌లకు కొందరు ఈమధ్య ఆసక్తి చూపుతున్నారు. 10 నెలల క్రితం పర్యాటకంగా ఈ రెండింటినీ అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ, రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించారు. ఇప్పటివరకు ఆదిశగా ఎటువంటి చర్యలూ ప్రారంభం కాలేదు.

తిరుమలలో బిహారీలు

● బాలాజీనగర్‌లో నివాసం

● భద్రతా తనిఖీల్లో గుర్తించిన పోలీసులు



ఇతర రాష్ట్రాలకు చెందిన వారి వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):తిరుమల కొండపై ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు చాలా మంది నివాసం ఉంటున్నట్టు టీటీడీ గుర్తించింది. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా చేపడుతున్న తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. వీరిలో అత్యధికంగా బీహార్‌వాసులున్నట్టు గుర్తించారు. స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారు ఉన్నట్టు వెల్లడైంది. వీరంతా హోటల్ కార్మికులు. తిరుమలలోని ప్రయివేటు హోటల్ యజమానులు బాలాజీనగర్‌లోని ఇళ్లను అద్దెకు తీసుకుని వీరికి కేటాయిస్తున్నారు. వీరి ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను తిరుమల పోలీసులు సేకరిస్తున్నారు. అలాగే ఎలాంటి గుర్తింపు లేకుండా తిరుమలలో షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసముంటున్న వారిని గుర్తించి తిరుపతికి తరలిస్తున్నారు. ఈ షెడ్లను తొలగిస్తున్నారు.

భక్తుల బ్యాగ్ భద్రంగా..



బ్యాగులోని బంగారు తాళిబొట్టు చైన్‌ను అందజేస్తున్న పోలీసులు

తిరుమల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అలిపిరి స్కానింగ్ కేంద్రంలో మర్చిపోయిన బ్యాగును తిరుమల పోలీసులు భక్తులకు తిరిగి అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీధర్ బోపన్న, డాక్టర్ ప్రజ్ఞశ్రీ దంపతులు కుటుంబంతో కలిసి బుధవారం ఉదయం కాలినడకన తిరుమలకు చేరుకునేందుకు అలిపిరికి చేరుకున్నారు. అక్కడ బ్యాగుల స్కానింగ్ కేంద్రంలో 80 గ్రాముల బంగారు తాళిబొట్టు గొలుసున్న బ్యాగును మరచిపోయారు. ఆయన తిరుమల పోలీసులను ఆశ్రయించగా కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. దీంతో ఆ బ్యాగు పొరపాటున మరో భక్తుడి లగేజీలో చేరినట్టు గుర్తించారు. వెంటనే ఆభక్తుడిని సంప్రదించి బ్యాగును స్వాధీన పరుచుకుని శ్రీధర్ బోపన్నకు బ్యాగును అందజేశారు. నాలుగు గంటల వ్యవధిలోనే బ్యాగును గుర్తించి తిరిగి భక్తులకు అందజేసిన తిరుమల సీఐ శ్రీరాముడు, ఎస్‌ఐలు లక్ష్మణ్, చలపతిలను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

ఆరుగురు 'ఎర్ర' స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఆరుగురు స్మగ్లర్లకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఏడీజే న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. ఎనిమిదేళ్ళ క్రితం కరకంబాడి ఫారెస్టు బీటు టీఎన్ పాలెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో జిల్లాకు చెందిన చాంద్‌బాషా, అవినాష్, నాగరాజు, ధనశేఖర్, వరదరాజులు, ఎం.నాగరాజు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిపై ముందుగా అందిన సమాచారం మేరకు అప్పటి టాస్క్‌ఫోర్సు అధికారులు వీరిని పట్టుకుని అరెస్టు చేశారు. అప్పట్లో వీరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసు మళ్లీ తిరుపతి ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు కేసు పూర్వాపరాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించారు. ఈ క్రమంలో నేరం చేశారని రుజువు కావడంతో ఆ ఆరుగురు స్మగ్లర్లకు న్యాయమూర్తి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

మత్తు వీడండి.. జీవితాన్ని గెలవండి

● యాంటీ డ్రగ్స్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ పిలుపు



ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల యువత డ్రగ్స్ బారిన పడుతున్నారు. ఆ మత్తులో ఇతర నేరాలకు.. మహిళల మీద అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. మరోవైపు వారి ఆరోగ్యమూ క్షీణిస్తోంది. అందుకని ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. యువత కూడా మత్తు వీడటం ద్వారా జీవితాన్ని గెలవచ్చు' అని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం తిరుపతిలో ఆర్డీవో కార్యాలయం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారన్నారు. కొంతమంది యువకులను డ్రగ్స్, గంజాయి అనే మత్తు పదార్థాలు పట్టిపీడిస్తున్నాయని ఎస్పీ హర్షవర్ధనరాజు ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మన స్నేహితులు మాదక ద్రవ్యాలు తీసుకుంటుంటే మౌనంగా ఉండటం మంచిది కాదన్నారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ తీసుకుంటున్నట్లు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పుడే ఈ మహమ్మారిని నివారించగలమన్నారు. 'డ్రగ్స్ ప్రభావం సమాజం మీద ఎలా ఉంటుంది? దీని నిర్మూలనకు ఎలా కృషి చేయాలనే దానిపై పాఠశాల, కళాశాలల్లో ఇతర శాఖల సమన్వయంతో మేము ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం' అని ఎస్పీ వివరించారు. పోలీసులకు సమాచారం ఇద్దాం.. డ్రగ్స్ నివారిద్దాం నినాదంతో ముందుకెళదామని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు..జీవితం ముద్దు అంటూ ర్యాలీలో విద్యార్థులు, యువత నినాదాలు చేశారు. ప్లకార్డులతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అందరిచేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు. ఎంఆర్‌పల్లె సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడ్డారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నేత శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, అదనపు కమిషనరు చరణ్‌తేజరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కాగా, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్ ర్యాలీలు నిర్వహించారు.

ప్రాథమిక పాఠశాలకు తాళం

● విలీనంపై విద్యార్థుల నిరసన





బంగారమ్మ కండ్రిగ స్కూలు ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన - తాళం వేయడంతో బయట కూర్చున్న ఉపాధ్యాయుడు

కేవీబీపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తమ ఊరి పాఠశాల తరగతులను మరో గ్రామ పాఠశాలలో విలీనం చేయవద్దంటూ కేవీబీపురం మండలం బంగారమ్మ కండ్రిగలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేశారు. ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులున్నారు. ఇటీవల ఈ స్కూలును రెండున్నర కిలోమీటర్ల దూరంలోని ఎస్ఎన్ కండ్రిగ పాఠశాలలో విలీనం చేశారు. తమ పిల్లలు అంత దూరం వెళ్లి చదవడం కష్టంగా ఉంటుందంటూ తల్లిదండ్రులు తాళం వేశారు. చేసేదిలేక ఉపాధ్యాయుడు బయట కూర్చుని సమయం అయ్యాక వెళ్లిపోయారు.

'ఆభ' కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం

● జాయింట్ కమిషనర్ డాక్టర్ బీసీకే నాయక్



చంద్రగిరి సీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భవ (ఆభ) కార్డుతో రోగి మెడికల్ హిస్టరీ అనుసంధానం చేయబడుతుందని ఏపీ వీవీపీ జాయింట్ కమిషనర్ విజిలెన్స్ బీసీకే నాయక్ తెలిపారు. గురువారం చంద్రగిరిలోని సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను, పరిసరాలను పరిశీలించారు. ప్రతి రోగి తమ వెంట ఆధార్‌తో పాటు ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ ఫోన్‌ను తీసుకురావాలన్నారు. ఆధార్ కార్డుతో 'ఆభ' కార్డు లింక్ చేయబడుతుందన్నారు. తద్వారా దేశంలో ఏ ఆస్పత్రికి వెళ్లినా రోగి మెడికల్ హిస్టరీ రికార్డు అందుబాటులోకి వస్తుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మెడికల్ హిస్టరీ ద్వారా రోగి సకాలంలో మెరుగైన వైద్య చికిత్సలు అందించడానికి వీలు కలుగుతుందన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ముఖచిత్రం మారబోతోంది

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు



చైతన్య రథాలను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు

తిరుపతి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా మైదానంలో జూలై 6వ తేదీ జరగనున్న బీసీ ఆత్మగౌరవ సభతో రాజకీయ ముఖచిత్రం మారబోతోందని, రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన బాలాజీకాలనీలోని ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి, బీసీ ఆత్మగౌరవ సభ ప్రచార చైతన్య రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆత్మగౌరవ సభతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నానన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ మాట్లాడుతూ సభను విజయవంతం చేయడంలో భాగంగా అన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ప్రచార రథాలను ప్రారంభించినట్లు వివరించారు. టీడీపీ నేత మబ్బుదేవనారాయణరెడ్డి మాట్లాడుతూ బీసీలు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బీసీ సంఘం కన్వీనర్ ఆల్మన్‌రాజు, మాజీ మంత్రి పరసారత్నం మాట్లాడుతూ కులమతాలకతీతంగా సభకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కులసంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎస్వీయూ పీజీ జవాబు పత్రాల మూల్యాంకనంపై ప్రత్యేక శ్రద్ధ

● పది రోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మూల్యాంకనం ఆలస్యమైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో పది రోజుల్లో పీజీ నాలుగు సెమిస్టర్ల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి అయ్యేందుకు ప్రణాళిక రూపొందించారు. పీజీ 3, 4వ సెమిస్టర్ల మూల్యాంకనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పీజీ 1, 2వ సెమిస్టర్ల మూల్యాంకనం వచ్చే నెల 7 వ తేదీ నాటికి పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఇకపై యూనివర్సిటీలోని కాలేజీల వారిగా మూల్యాంకనాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారులను నియమించే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు వర్సిటీ కాలేజీల ప్రిన్సిపాళ్లకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రగిరి హైవేలో లారీ హైజాక్

● రాజంపేట వద్ద పట్టుకున్న పోలీసులు

చంద్రగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండల పరిధిలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గురువారం సాయంత్రం లారీ హైజాక్ గురైంది. కర్ణాటక రాష్ట్రం బంగారుపేట నుంచి క్యాబేజీ, క్యాప్సికం లోడుతో లారీ రాజమండ్రికి బయలుదేరింది. గాదంకి టోల్ ప్లాజా వద్ద ఐదుగురు దుండగులు లారీని ఆపి, డ్రైవర్ చరణ్‌కుమార్‌పై దాడి చేసి తీసుకెళ్లారు. డ్రైవరు ఫిర్యాదుతో చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత లారీ కోసం గాలించారు. పోలీసులు లారీని వెంబడించి, రాజంపేట సమీపంలో పట్టుకొన్నారు. ఐదుగురు దుండగులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ ఊహాసిరి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించడం వలన అనారోగ్యాల బారిన పడుతారన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు నిర్వీర్యమవుతుందని తెలియజేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. సమాజంలో మాదకద్రవ్యాలను నియంత్రించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. డ్రగ్స్ వినియోగం ఆరోగ్యాన్ని హానికరమే కాకుండా చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్‌ను వినియోగించినా, అమ్మకాలు సాగించినా, అక్రమరవాణా చేపట్టినా కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ డ్రగ్స్ రహిత సమాజానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కిషోర్‌బాబు, శేఖర్‌బాబు, శ్రీనివాసులు, బాలకృష్ణ, కరీమాబేగం, సూర్యనారాయణ, సురేంద్రబాబు, ఎస్ఐలు శేషమ్మ, ఎండీ.రఫీ, మనోజ్‌కుమార్, తిరుపతయ్య, గోపాల్, సురేష్‌బాబు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ గురువారం స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన 21 మందికి రూ.13.37 లక్షల చెక్కులను అందించామన్నారు. ఎవరైనా సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం పొందాలంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అనంతరం గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, అమరేంద్ర, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, చంద్రమౌళి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ డీఈ షబ్బీర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో గురువారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి సహకారంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, మురళీనాయుడు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాహుమహరాజ్ జయంతి


సాహుమహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలోని పూలేదంపతుల విగ్రహాల వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో సాహుమహరాజ్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకుడు నాశిన భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సాహుమహరాజ్ ఎనలేని కృషి చేశారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, రవికుమార్, వెంకటేశ్వర్లురాజు, ఎల్‌వీసుబ్బయ్య, రవి, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం

గూడూరు అర్బన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి లాభదాయకమైన పంటగా గుర్తించిన ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి సునీత వెల్లడించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నాటేందుకు ఉచితంగా మొక్కలు, ఎకరానికి రూ.2100 రాయితీ, ఆకర్షణీయమైన పంట మద్దతుధర ఇవ్వనున్నట్లు వివరించారు. మొక్కలు నాటిన 4వ సంవత్సరం నుంచి దాదాపు 25 ఏళ్లకు పైగా దిగుబడిని ఇస్తుండడంతో ఆయిల్‌పామ్‌ను లాభపంటగా పేర్కొన్నారు. ఆరో ఏడాది వరకు ఎకరానికి 5 టన్నులు, ఆపై 10 టన్నుల వరకు దిగుబడితో సాగుదారులకు లాభాల పంట పండిస్తుందన్నారు. సమీప రైతుసేవా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారు, బ్యాంకు పాస్‌పుస్తకాలు నకళ్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సంప్రదించాలన్నారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె వివరించారు.

గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న జిల్లా గ్రామపంచాయతీ అధికారి సుశీలదేవి

వెంకటగిరిటౌన్, జూన్ 26(ఆంధ్ర జ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజలు తమ వంతు సహకరించాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.సుశీలదేవి కోరారు. గురువారం స్థానిక మండల పరిధిలోని కలవల పూడిలో శానిటేషన్, వీధి దీపాలు, రోడ్లు, తాగునీరు వంటి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వేలో భాగంగా ప్రతి గ్రామాన్నీ పరిశీలించి అభివృద్ధి ఎలా ఉందో స్వయంగా తెలుసుకున్నామన్నారు. తడి చెత్త పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. సర్పంచి బత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత


డక్కిలిలో చేపట్టిన అవగాహన ర్యాలీ

డక్కిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో గుణశేఖర్ తెలియజేశారు. డక్కిలిలో గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కమ్మపల్లి రోడ్డు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో పిన్నక జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి చైతన్య, హెచ్‌ఎం గీత పాల్గొన్నారు.

టమోటా వ్యాన్ బోల్తా



వెంకటగిరిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి-రాపూరు రోడ్డు సమీపంలో కలపాడు రోడ్డు వద్ద టమోటా వ్యాన్ గురువారం బోల్తా పడింది. తిరుపతి నుంచి డక్కిలికి పోతుండడంతో టమోల వ్యాన్ బోల్తా పడింది. నేషన్‌హైవే ట్రాలీ వచ్చి వ్యాన్‌ను పైకి లేపారు. నేలపాలు అయిన టమోటాల కోసం ప్రజలు ఎగబడ్డారు. డ్రైవర్ తిరుపాలుకు స్వల్ప గాయాలయ్యాయి.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో గురువారం పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పోలేరమ్మను ప్రతిష్ఠించి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లపెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి మంగళవాయిద్యాలు, బాణాసంచా పేళ్లుళ్ల నడుమ వైభవంగా గ్రామోత్సవం జరిపించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గూడూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆధ్వర్యంలో గురువారం జీవాలకు నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ గురువారం నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జీవాల్లోని అనారోగ్య సమస్యలను తొలగించేందుకు నట్టల నివారణ మందులను తాగిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం


ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరిటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ రమణ సూచించారు. గురువారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళశాల నుంచి పుర వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసగా మారకూడదన్నారు. భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఎటువంటి సమాచారం తెలిసినా 1972కు ఫోన్ చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ ఏడుకొండలు, పులికల్లు రాజేశ్వరరావు, గంగాధర్, ఆనంద్, రామచంద్రయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో పట్టపగలే చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురం 3వ వీధిలో పట్టపగలే చోరీ జరిగింది. రాజగోపాలపురం 3వ వీధిలో నివసిస్తున్న సిద్ధలయ్య ఆర్టీసీ బస్టాండ్‌లో రోజువారి కూలీగా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం ఆయన భార్య ఇంటికి తాళాలు వేసి భర్తకు భోజనం తీసుకెళ్లింది. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగిలిపోయి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులోని 2 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే భర్త సిద్ధలయ్యతో కలిసి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


ముఖేష్ (ఫైల్)

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కోట పట్టణంలోని జయరామ్‌నగర్‌కు చెందిన ముఖేష్ (18) అదృశ్యం కావడంతో గురువారం అతడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుజరాత్ ప్రాంతానికి చెందిన ముఖేష్ తల్లిదండ్రులు కొద్ది సంవత్సరాలుగా కోటలో టీ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ముఖేష్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.

ఓ ఫారం లేకుంటే లైసెన్స్‌లు రద్దుచేస్తాం

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల దుకాణం దారులు తమ షాపులకు ఆమోదం పొందిన ఓ ఫారం ఉండాలని లేకుంటే ఆ దుకాణాలను సీజ్ చేస్తామని ఏవో సుచేంద్రప్రసాద్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం ఎరువులు, పురుగు మందుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ అధికారి సాయికుమార్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ సంగమేశ్వరరావు

పెళ్లకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలు, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఎంఈవో కార్యాలయం రహదారి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సంగమేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్త నను నిశితంగా పరిశీలించి తగిన జగ్రత్తలు తీసుకో వాలన్నారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో ప్రమీలారాణి, డిప్యూటీ తహసీల్దార్ యువ రాజు, డాక్టర్ పీ. జితేంద్ర, ఎంఈవో-2 మించల శంకరయ్య, సీహెచ్‌వో శివారెడ్డి, వీఆర్వో వంశీకృష్ణ, రమణయ్య, పంచాయతీ కార్యదర్శి రమాప్రభ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం


నట్టల నివారణ మందును వేస్తున్న కృష్ణయ్య, అధికారులు

పెళ్లకూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : నట్టల నివారణ మందుతో మూగ జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి సురక్షితంగా ఉంటాయని పశుసంవర్ధక శాఖ ఏడీ ధనుంజయులు పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య చేతుల మీదుగా నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చెంబేడు, పునబాక, పెళ్లకూరు పశు వైద్యశాలల పరిధిలో మూడు బృందాలను ఏర్పాటు చేసి 24 పంచాయతీలోని 2950 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ జే అమరావతి, పశుసంవర్ధక సహాయకులు నికోరాణి, ముకుంద తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల బాధితుడికి న్యాయం జరగాలని నేటి నుంచి నిరసన దీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షనేతలు

వెంకటగిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గత ఏడాది గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో పోలీసుల దాడిలో గాయపడిన దళితుడు చెంచుకుమార్‌కు న్యాయం చేయాలని వామపక్షనేతలు, దళిత, గిరిజన సంఘాల నేతలు శుక్రవారం నుంచి నిరసన దీక్షలు చేపట్టనున్నారు. గురువారం వారు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాయపడిన చెంచు కుమార్‌కు రెండెకరాలు భూమి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. ఆ హామీ అమలుకోసం నిరసనదీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షల్లో దళిత, గిరిజన, వామపక్ష నేతలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, వెంకటగిరి ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పల్లిపాటి రవి, దళిత, గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను అడ్డుకుంటాం


ఎస్ఐ స్వప్న ఆధ్వర్యంలో మానవహారంగా నిలుచుని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు


ఓజిలి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సహకారంతో గ్రామీణ ప్రాంతాలలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అడ్డుకుంటామని ఓజిలి ఎస్ఐ స్వప్న అన్నారు. ఓజిలిలో గురువారం మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి మహిళలు, విద్యార్థులు, పలు శాఖల అధికారులు బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. బస్టాండు వద్ద మహిళలతో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు ఏపీఎం పద్మ, పొదుపు మహిళలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


ఉచ్చూరులో ఘటనాస్థలిలో బాధితురాలితో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

దొరవారిసత్రం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : దొరవారి సత్రం మండలం ఉచ్చూరు గ్రామంలో అట్రాసిటీ కేసుపై గురువారం నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు విచారణ చేపట్టారు. ఈనెల 19న ఆగ్రామ దళిత కాలనీకి చెందిన బద్ది బుజ్జమ్మపై అదే గ్రామానికి చెందిన చిట్టేటి మునిరెడ్డి దౌర్జన్యం చేసినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ జరిపారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల విషయంలో బాధితురాలు బుజ్జమ్మ, మునిరెడ్డి మధ్య వాదనలు రావడంతో మునిరెడ్డి బుజ్జమ్మను తోసివేయడంతో ఆమెకు ఎడమ చేయికి గాయమవడంతో బాధితురాలు స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుపై విచారణకు వెళ్లిన డీఎస్పీ చెంచుబాబు ఘటనా స్థలిని పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడారు. గ్రామంలోనూ విచారణ చేపట్టారు. విచారణలో డీఎస్పీ వెంట స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఉన్నారు.

రాత్రికి రాత్రే జామాయిల్ నరికివేత



అక్రమార్కులు నరికివేసిన జామాయి గ్రామస్తులు పట్టించిన ట్రాక్టర్

కోట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : కోట మండలం మద్దాలి సమీపంలో ఉన్న జామాయిల్ చెట్లను రాత్రికి రాత్రేనరికి తరలిస్తున్న దుండగులను గ్రామస్తులు గురువారం పోలీసులకు పట్టించారు. మద్దాలి సమీపంలో వనసంరక్షణ సమితులు, పంచాయతీ ఆధ్వర్యంలో 30 ఎకరాల అటవీశాఖ భూముల్లో జామాయిల్ చెట్లను సాగు చేపట్టారు. ఓజిలి మండలానికి చెందిన పలువురు గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే జామాయిల్‌ను రంపాలతో కోసి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని బయట ప్రాంతాలకు విక్రయిస్తున్నారు. అందులో భాగంగానే బుధవారం రాత్రి ట్రాక్టర్‌ను జామా యిల్ తోటలో ఉంచి అక్రమంగా నరికి లోడ్ చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో దుండగులు ట్రాక్టర్‌ను వదిలి పరారయ్యారు. ఇద్దరిని పట్టుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు బుగ్గిపాలు


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయశ్రీ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, నాయకులు రమేష్, కిషోర్ తదితరులు



నాయుడుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నాయుడుపేట, జూన్ 26 : మాదక ద్రవ్యాలను వినియోగిస్తే వారితోపాటు వారి కుటుంబసభ్యుల జీవితాలు బుగ్గిపాలు అవుతాయని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గాంధీ మందిరం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో మునిరత్నం, డాక్టర్ గురవయ్య, దార్ల రాజేంద్ర, సీడీపీవో ఉమామహేశ్వరి ఉన్నారు.

సూళ్లూరుపేట: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మాదరకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా సూళ్లూరుపేట పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు వరకు జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎంఈవో శ్రీనివాసులు, సీడీపీవో జ్యోతికిరణ్, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు వెంకటస్వామి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై మానవహారం



చిట్టమూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి) : మాదకద్రావ్యాల నియంత్రణ, అక్రమ రవాణాపై వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం చిట్టమూరులో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, అధికారులు, విద్యార్థులు చిట్టమూరు నుంచి కొత్తగుంట కూడలి వరకు మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని, మాదకద్రావ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కొత్తగుంట కూడలిలో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో కోట ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, చిట్టమూరు వైద్యాధికారి సుచేంద్ర, హౌసింగ్ ఏఈ సుధీర్, ఏపీఎం గున్నయ్య, ఏపీవో షీలు ఉన్నారు.

డ్రగ్స్ వినియోగంపై ర్యాలీ

తడ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ వినియోగంపై స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ కూడలిలో మానవ హారం ఏర్పాటు చేశారు. ఎస్ఐ కొండప్ప నాయుడు, ఎంఈవో మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


ర్యాలీలో పాల్గొన్న సీఐ హుస్సేన్‌బాషా, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు

వాకాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల అలవాటుతో భవి ష్యత్తు నాశనం అవుతుంద సీఐ హుస్సేన్‌బాషా అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులతో కలసి మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, డిప్యూటీ తహసీల్దారు సం దీప్, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర రావు, ఎంఈవో నసీం ఆలీ, ఏవో దీప, ఏపీవో విజయ తదితరులు పాల్గొన్నారు.

బాలయపల్లి: బాలయపల్లిలో డ్రగ్స్ నియంత్రణపై ఎస్ఐ గోపీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై ర్యాలీ జరిగింది. డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌రాజు, సీడీపీవో షంషాద్ బేగం, ఏపీఎం కిరణ్ మానవహారం చేపట్టారు.

కోట: ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శులు, సచివా లయ సిబ్బంది మాదక ద్రవ్యాల వినియోగంపై కోటలో అవగాహన ర్యాలీ చేపట్టారు. సీడీపీవో మునికుమారి, ఏపీఎం అనీల, ఎస్ఐ పవన్‌కుమార్, మెరైన్ పోలీసులు ఉన్నారు.